E-KABURU

# ఈ-కబురు

5-03-2025 బుధవారం | హైదరాబాద్ | ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం | www.ekaburu.com

మాధురిని రక్తంవచ్చేలా ముద్దుపెట్టిన హీరో

6లో





## విసిల రాజీనామాలపై
# సభలో రగడ

**ఎవ్వరినీ బెదిరించాల్సిన అసవరం లేదు**

**మండలిలో చర్చ సందర్భగా లోకేశ్ స్పష్టీకరణ**

**ఆధారాలు చూపినా వియరణ లేదన్న బొత్స**

**అమరావతి, ఈ-కబురు:** వీసీల రాజీనామా అంశంపై శాసన మండలిలో వాడీవేడీ చర్చ జరిగింది. వైకాపా ఆరోపణలపై నిగ్గుతేల్చేందుకు ప్రివిలేజ్ కమిటీకి పంపాలని మంత్రి లోకేశ్.. స్పీకర్‌ను కోరారు. వీసీల రాజీనామా లేఖల్లో 'బెదిరించినట్లు' అనే పదం ఎక్కడా లేదని లోకేశ్ స్పష్టం చేశారు. వైకాపా నియమించిన వీసీలకు బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్ కూడా రాదని ఎద్దేవా చేశారు. వీసీల రాజీనామా లేఖల్లో బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయా అని ప్రశ్నించారు. 'రాజీనామా చేసిన ఒక వీసీ.. రాజారెడ్డి చెల్లెలి కోడలు. రాజీనామా చేసిన ప్రసాద్‌రెడ్డి.. వైకాపా కార్యకర్త. జగన్ పుట్టినరోజు వేడుకలు వర్సిటీలో చేసిన వ్యక్తి ఈ ప్రసాద్ రెడ్డి అని పేర్కొన్నారు. పార్టీ కోసం సర్వేలు చేయించిన ఘనత ఆనాటి వీసీలదని లోకేశ్ వ్యాఖ్యానించారు. వీసీలను బెదరించిన వ్యవహారంపై ఏపీ శాసనమండలిలో రగడ చోటు చేసుకోవడంతో సభ వాయిదా పడింది. అనంతరం శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

మిగతా 2లో

## కృష్ణా జలాల్లో తెలంగాణకు
# 70% వాటా

**తెలంగాణకు కేటాయించండి**

**పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, సమ్మక్క సాగర్‌లకు అనుమతులివ్వండి**

**కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి**

**గోదావరిపై రాష్ట్ర ప్రాజెక్టులకు శాశ్వత కేటాయింపులు జరపాలని విన్నపం**

**ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన పోలవరం-బనకచర్లపై ఫిర్యాదు**

**సాగునీటి పథకాలకు 50 ఏళ్ల కాలానికి వడ్డీలేని రుణం అందించాలని అభ్యర్థన**



**దిల్లీ, ఈ-కబురు:** "కృష్ణా నదీ పరీవాహకం 70% తెలంగాణలో ఉంటే 30% మాత్రమే ఆంధ్రప్రదేశ్‌లో ఉంది. అందువల్ల కృష్ణా జలాల్లో 70% వాటా తెలంగాణకు కేటాయించండి. గోదావరికి సంబంధించి తెలంగాణ వాటా నికర జలాలను తేల్చిన తర్వాతే ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై నిర్ణయం తీసుకోండి" అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు విన్నవించారు. ఆయన సోమవారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి దిల్లీలో కేంద్ర మంత్రి పాటిల్, ఆ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీలను కలిశారు. రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కేంద్ర మంత్రికి అందించారు. "కృష్ణా పరీవాహక ప్రాంతం తెలంగాణలో ఎక్కువగా ఉన్నప్పటికీ కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పక్షపాతంగా ఆంధ్రప్రదేశ్‌కు 66%, తెలంగాణకు 34% నీటి కేటాయింపులు చేసింది. ఫలితంగా మేం ఏళ్లుగా నష్టపోతూ వస్తున్నాం. ఈ ఏడాది సైతం ఆంధ్రప్రదేశ్... తన కేటాయింపులకు మించిన నీటిని తరలించుకుపోయింది. ఇకపై నీటి తరలింపు జరగకుండా చూడటంతోపాటు కృష్ణా ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు సంబంధించి వెంటనే టెలిమెట్రీ యంత్రాలు ఏర్పాటు చేయండి. అవసరమైతే అందుకయ్యే మొత్తాన్ని మేమే భరిస్తాం. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 2022లోనే డీపీఆర్ సమర్పించినా అనుమతులివ్వలేదు. అదే సమయంలో న్యాయస్థానాల పరిధిలో ఉన్న అప్పర్‌భద్రకు మాత్రం అనుమతులిచ్చారు" అని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

**పునర్విభజన చట్టానికి విరుద్ధంగా 'బనకచర్ల'**

ఉమ్మడి రాష్ట్ర పునర్విభజన చట్టానికి విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ గోదావరి-బనకచర్ల అనుసంధాన పథకానికి రూపకల్పన చేసిందని జలశక్తి మంత్రి పాటిల్‌కు రేవంత్‌రెడ్డి ఫిర్యాదుచేశారు. ఈ పథకానికి ఏపీ ప్రభుత్వం... కేంద్ర జలసంఘం, గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ), కేఆర్ఎంబీల నుంచి ఎటువంటి అనుమతి పొందలేదని తెలిపారు. ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉన్న ఎపెక్స్ కౌనిల్స్‌లోనూ ఎటువంటి

మిగతా 2లో

# వ్యవసాయంపై అవగాహనలేని సీఎం

**పంటలు ఎండుతున్నా.. చీమకుట్టినట్టుగా లేదు**

**రైతు బీమా పథకానికి ఎగనామం**

**గతంలో బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ అండ : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి**



**హైదరాబాద్, ఈ-కబురు:** వ్యవసాయంపై అసలు సీఎం రేవంత్‌రెడ్డికి కొంచెం కూడా అవగాహన లేదని, అందుకే పంటలు ఎండుతున్నా.. చీమకుట్టినట్టుగా లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో నిరంజన్ రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి రైతు ఏ కారణం చేత మరణించినా రూ.5 లక్షల పరిహారం అందించే పథకం రైతు బీమా.. రైతు చనిపోయిన ఏడు పని దినాలలో రైతు

మిగతా 2లో



# బీజేపీని నమ్మితే అమ్ముడు ఖాయం

**ఆదిలాబాద్‌లోని సీసీసీని అమ్మేందుకు సిద్ధపడటం దుర్మార్గం**

**నమ్మి ఓట్లేసినందుకు ఇదేనా మీరిచ్చే బహుమతి**

**కార్మికుల ఆవేదన, ఆర్తనాదాలు వినిపించడం లేదా : మాజీ మంత్రి కేటీఆర్**

**పార్టీ మారిని వారితో రాజీనామా చేయించండి**

**మరోమారు డిమాండ్ చేసిన కెటిఆర్**


2లో



2లో

## టీచర్ ఎమ్మెల్సీ కొమురయ్యకు బిజెపి అభినందనలు

**ఉపాధ్యాయ సంఘాలకు కిషన్ రెడ్డి కృతజ్ఞతలు**



## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

**నోటీసులు జారీ చేసిన సుప్రీం ధర్మాసనం**

**విచారణ 25కు వాయిదా**

2లో

# నేటి నుంచి మీనాక్షి సమీక్షలు



**హైదరాబాద్, ఈ-కబురు:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పనితీరుపై మంగళవారం నుంచి గాంధీభవన్‌లో ఏఐసీసీ కొత్త ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ సమీక్షలు నిర్వహించనున్నారు. ఒక్కో లోక్‌సభ నియోజకవర్గ స్థాయిలో పార్టీ పనితీరును తెలుసుకునే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం మెదక్, మల్కాజిగిరిబీ బుధవారం కరీంనగర్, ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల స్థాయిలో పార్టీ నేతలందరితో ఆమె సమీక్షించనున్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగే సమీక్షలకు ఆయా నియోజకవర్గాల పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీలు, ఇతర ముఖ్యనేతలందరూ రావాలని పీసీసీ ఇప్పటికే ఆహ్వానాలు పంపింది. ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జిగా

మిగతా 2లో



## ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా కొమరయ్య, శ్రీపాల్‌రెడ్డి

**కరీంనగర్‌లో మొదటి ప్రాధాన్య ఓట్లతో భాజపా బలపరిచిన అభ్యర్థి విజయం**

**సిటింగ్‌లకు చేదు అనుభవం**

**పట్టభద్రుల ఎన్నికలో భారీగా చెల్లని ఓట్లు**

2లో

# నేటినుంచి ఇంటర్ పరీక్షలు

**కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన బోర్డు**

**మొత్తం 1,532 పరీక్షా కేంద్రాల ఏర్పాటు**

**సిసి కెమరాలతో కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షణ**

**నిముషం నిబంధన ఎత్తివేత..5 నిముషాల వరకు అనుమతి**




**హైదరాబాద్, ఈ-కబురు:** తెలంగాణలో ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొదటి, ద్వితీయ సంవత్సరం కలిపి దాదాపు పది లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో అబ్బాయిలు

మిగతా 2లో

# కృష్ణా జలాల్లో తెలంగాణకు 70% వాటా



మొదటి పేజీ తరువాయి

చర్చ జరగలేదని తెలిపారు. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాపాడుకునే విషయంలో తాము ఏమాత్రం రాజీపడబోమని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతల, మోడికుంట వాగు, చనాఖా కోర్టా బ్యారేజీ (డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్), చిన్న కాళేశ్వరం (ముక్తేశ్వర) ఎత్తిపోతల పథకాలకు సత్వర సాగు నీటి ప్రయోజన పథకం(ఏఐబీపీ) కింద తగిన ఆర్థిక సహాయం అందజేయాలని విన్నవించారు. మౌలిక వసతుల అభివృద్ధి కింద తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు 50 ఏళ్ల కాలానికి వడ్డీలేని రుణాలు ఇవ్వాలని అభ్యర్థించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు సంబంధించి తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తామని, ముంపునకు సంబంధించి మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పించాలని కోరారు. సమావేశానంతరం విలేకర్లతో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రస్తుతం ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు, వాటికి నీటి కేటాయింపులు, వినియోగంలో సమస్యలపైనే కేంద్రమంత్రితో చర్చించామన్నారు. గోదావరి-మూసీ అనుసంధానంపై ఇటీవలే ప్రధానికి వివరించామని, దానిపై నివేదిక అడిగినప్పుడు తప్పకుండా అందిస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. జలశక్తి మంత్రికి ఎస్-ఎల్‌బీసీ ప్రమాదం గురించి వివరించామన్నారు. సముద్రంలో కలుస్తున్న గోదావరి నీటిని ఉపయోగించుకొనేందుకు చేపడుతున్న 'బనకచర్ల'పై తెలంగాణకు అభ్యంతరాలు అవసరం లేదని ఇటీవల ఏపీ సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను విలేకరులు ప్రస్తావించగా రేవంత్ స్పందిస్తూ... "మేం గోదావరి నికర జలాల ఆధారంగా నిర్మిస్తున్న సమ్మక్క-సారక్క, సీతారామ, ఇతర ప్రాజెక్టులకు ఇప్పటివరకు కేటాయింపులే జరగలేదు. సముద్రంలో కలిసే గోదావరి నీటిని వాడుకోవడానికే ప్రాజెక్టులు కడుతున్నామంటున్న ఆంధ్రప్రదేశ్... తెలంగాణ ప్రాజెక్టులకు ఎందుకు అభ్యంతరం పెడుతోంది? మా శాశ్వత ప్రాజెక్టులకు శాశ్వత కేటాయింపులు జరిగిన తర్వాతే మీకు వరద జలాలు ఉన్నాయా? లేదా? అన్నది తేలుతుంది. అనంతరమే ఏపీ చేపడుతున్న ఇతర ప్రాజెక్టులకు అనుమతివ్వాలి. మరోవైపు... మేం చేపట్టిన సమ్మక్క సారక్క, సీతారామ ప్రాజెక్టులకు సీడబ్ల్యూసీ నుంచి తుది అనుమతులు రాలేదు. వాటి విషయంలో ఆంధ్రప్రదేశ్ అభ్యంతరం పెట్టింది. దానివల్లే మేం పదేపదే సీడబ్ల్యూసీ వద్దకు వచ్చి వాటిపై విన్నవించాల్సి వస్తోంది. గోదావరి వరద జలాలను బనకచర్ల ద్వారా కృష్ణాబేసిన్‌కు తరలిస్తామంటున్న ఆంధ్రప్రదేశ్ మా నికరజలాల ప్రాజెక్టులకు ఎందుకు అభ్యంతరం పెడుతోంది? మా ప్రాజెక్టులు పూర్తయి, ఆయకట్టు స్థిరీకరణ జరగకముందే ఆంధ్రప్రదేశ్ టెయిల్‌ఎండ్‌లో వరద జలాల ఆధారంగా కట్టుకున్న ప్రాజెక్టులకు ఆయకట్టు స్థిరీకరణ జరిగితే నీటికేటాయింపుల సందర్భం వచ్చినప్పుడు పూర్తయిన ప్రాజెక్టుల ఆయకట్టుకే తొలుత కేటాయింపులు జరుపుతామంటారు. అందుకే గోదావరిపై వరదజలాల లెక్క తేలిన తర్వాత... వారు ఏం నిర్మిస్తున్నారన్న దానిపై ఏపీ డీపీఆర్ ఇస్తే జీఆర్‌ఎంబీలో చర్చించి వాటిపై అభ్యంతరం ఉందా? లేదా? అన్నది చెబుతాం. మేం శాశ్వతంగా నికరజలాలపై కడుతున్న ప్రాజెక్టులపై అభ్యంతరం వ్యక్తంచేస్తున్న ఆంధ్రప్రదేశ్ తొలుత వాటిని ఉపసంహరించుకోవాలి. ఎన్డీయేలో వాళ్లు భాగస్వాములుగా ఉన్నందున మా ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇప్పించేందుకు సహకరించాలి.

**ఇప్పటికే కృష్ణా విషయంలో ఇబ్బంది పడుతున్నాం**

కృష్ణాలో తెలంగాణకు ఇలాంటి సమస్యే వచ్చింది. కృష్ణా డెల్టాకు సంబంధించి ఏపీలోని ఆయకట్టును స్థిరీకరించడంతో మొత్తం 811 టీఎంసీల్లో 512 టీఎంసీలను ఏపీ వినియోగించుకుంటోంది. తెలంగాణ 299 టీఎంసీలనే వాడుకుంటోంది. దీనికి ప్రధాన కారణం తెలంగాణలోని ప్రాజెక్టులు పూర్తికాకపోవడం, ఏపీలో పూర్తయిన ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు జరపడమే. కృష్ణాలో ఎదుర్కొంటున్న సమస్యనే గోదావరిలోనూ ఎదుర్కోవడానికి మేం సిద్ధంగా లేం" అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, నీటి పారుదల శాఖ ఈఎన్సీ (ఓఅండ్‌ఎం) విజయ్ భాస్కర్‌రెడ్డి, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

**కేంద్రం అన్ని విషయాల్లో సానుకూలంగా స్పందించింది: ఉత్తమ్**

నదీజలాలు, ప్రాజెక్టులకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి, తాను కలిసి వివరించిన అంశాలపై కేంద్రం సానుకూలంగా స్పందించిందని, తెలంగాణ ప్రయోజనాలను తప్పనిసరిగా కాపాడుతుందనే విశ్వాసంతో ఉన్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భరోసా వ్యక్తంచేశారు. సోమవారం కేంద్ర మంత్రి పాటిల్‌ను కలిసిన తర్వాత ముఖ్యమంత్రితో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడుతూ... "కృష్ణా జలాల్లో తెలంగాణకు నిరంతరంగా అన్యాయం జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ ఎక్కువ నీళ్లు తీసుకుపోతోందని, వెంటనే జోక్యం చేసుకోవాలని కేంద్రాన్ని కోరాం. సాగర్ కుడికాలువ నుంచి ఏపీ తరలిస్తున్న 10 వేల క్యూసెక్కుల నీటిని 5 వేలకు తగ్గిస్తామన్నారు. ముచ్చుమర్రి నుంచి తీసుకెళుతున్న నీటినీ నిలిపి వేయిస్తామని హామీ ఇచ్చారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులతోపాటు పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి, మల్యాల, ఇతర పాయింట్లలో టెలిమెట్రీలను ఏర్పాటు చేయాలని కోరగా తక్షణమే చేపడతామని హామీ ఇచ్చారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు సంబంధించి ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎలాంటి రిపోర్టు రాలేదని మాకు కేంద్రం తెలిపింది. కృష్ణా జలాల కేటాయింపులపై ప్రస్తుతం కొనసాగుతున్న కేడబ్ల్యూడీటీ-2 విచారణ త్వరగా పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని కోరాం. ట్రైబ్యునల్‌కు ప్రతిపాదించిన అదనపు విధివిధానాలపై సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్ వేసిన కేసులో తెలంగాణకు అనుకూలంగా వాదనలు వినిపించాలని విన్నవించాం. పాలమూరు-రంగారెడ్డికి రెండు వేర్వేరు విధాలుగా 90 టీఎంసీలను కేటాయించే విషయాన్ని పరిశీస్తామని, సీతారామసాగర్‌కు 67 టీఎంసీలను తక్షణమే కేటాయిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. సమ్మక్కసారక్క ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ ఇప్పించాలని... శ్రీశైలం, నాగార్జునసాగర్ ఆనకట్టల మరమ్మతులకు ఆర్థికసాయం చేయాలని కోరాం. మేడిగడ్డపై ఎన్డీఎస్‌ఏ నివేదికను త్వరగా ఇప్పించాలని, దాని ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం తదుపరి కార్యాచరణ చేపడుతుందని చెప్పినప్పుడు అతి త్వరలో నివేదిక ఇస్తామని హామీ ఇచ్చారు" అని వివరించారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా కొమరయ్య, శ్రీపాల్‌రెడ్డి

**హైదరాబాద్ -నల్గొండ, కరీంనగర్, ఈ-కబురు:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక స్థానంలో పీఆర్‌టీయూ టీఎస్, మరో చోట భాజపా మద్దతుతో బరిలో దిగిన అభ్యర్థులు విజయం సాధించారు. ఉమ్మడి నల్గొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానంలో పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించగాబీ ఉమ్మడి కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో భాజపా మద్దతు పలికిన అభ్యర్థి మల్క కొమరయ్య గెలుపొందారు. ఈ రెండో చోట్లా సిటింగ్ అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. మరోవైపు ఉమ్మడి కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం ఉదయం 10 గంటల తర్వాతే ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ ఇంకా చెల్లిన, చెల్లని ఓట్లను వేరుచేస్తున్నారు. ఈ ప్రక్రియకు మరింత సమయం పట్టనుండడంతో కౌంటింగ్ ఆలస్యం కానుంది. ఈ గ్రాడ్యుయేట్ స్థానంలో భారీగా ఓట్లు చెల్లుబాటు కాకపోవడం గమనార్హం. మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఫిబ్రవరి 27న పోలింగ్ జరగగా.. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో, నల్గొండ జిల్లాలోని ఆర్జాలబావిలో కౌంటింగ్ జరిగింది. భాజపా బలపరిచిన అభ్యర్థులు మూడు ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేయగా, కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి మాత్రమే పోటీ చేసింది.

**5,777 ఓట్ల ఆధిక్యంతో..**

ఉమ్మడి కరీంనగర్-మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీగా భాజపా బలపరిచిన అభ్యర్థి మల్క కొమరయ్య పీఆర్టీయూ(టీఎస్) అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిపై 5,777 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. మొత్తం 15 మంది అభ్యర్థులు ఈ స్థానంలో పోటీపడగా తొలి ప్రాధాన్య ఓట్లతోనే కొమరయ్య విజయాన్ని అందుకున్నారు. సిటింగ్ ఎమ్మెల్సీగా బరిలో నిలిచిన కూర రఘోత్తంరెడ్డి కేవలం 428 ఓట్లు మాత్రమే సాధించారు. మొత్తంగా ఈ స్థానంలో 25,041 ఓట్లు పోలవగా 24,144 చెల్లుబాటయ్యాయి. 897 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. పోలైన ఓట్లలో 50 శాతానికి మించి(12,074) ఓట్లు విజేతకు రావాల్సి ఉండగా కొమరయ్యకు 12,959 ఓట్లు వచ్చాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి గెలుపొందిన అభ్యర్థికి ధ్రువీకరణ పత్రాన్ని అందించారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

**న్యూఢిల్లీ, ఈ-కబురు:** బిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. గత విచారణ సందర్భంగా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోడానికి ఎంత సమయం తీసుకుంటారో స్పీకర్‌తో సంప్రదించి వివరాలు అందించాలని ధర్మాసనం ఆదేశించింది. కౌంటర్లు దాఖలు చేయడానికి ఇప్పటి వరకు తమకు ఎలాంటి నోటీసులు రాలేదని, సాంకేతికంగా ఇది గమనించాల్సిన విషయమని రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ కార్యదర్శి తరపు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ స్పీకర్, కార్యదర్శి, 10 మంది ఎమ్మెల్యేలు, కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది.

## విసిల రాజీనామాలపై సభలో రగడ

మొదటి పేజీ తరువాయి

అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. వీసీల రాజనామాలపై దర్యాప్తు జరపమని రెండు రోజుల క్రితం కోరామని.. ఆధారాలు ఇవ్వాలని ప్రభుత్వం కోరిందన్నారు. అన్ని ఆధారాలు నేడు మండలి ముందుకి తీసుకొని వచ్చినట్లు తెలిపారు. గవర్నర్ నియమించిన వీసీలను ఉన్నత విద్యాశాఖ అధికారులు ఏ విధంగా రాజీనామాలు చేయమని చెపుతారని విచారణ చేయమని చెప్పామన్నారు. అయితే ప్రభుత్వం తోక ముడుచుకొని వెళ్ళిందని విమర్శించారు. విచారణ చేయకుండా సవాల్ విసిరారని.. ఈ రోజు ఏమైందని ప్రశ్నించారు. సమాధానం చెప్పలేక దాబాయింపు, బుకాయింపులు, పరుష పదజాలంతో దూషణలు చేశారన్నారు. విచారణ జరగాలని.. వాస్తవాలు బయటకు రావాలని డిమాండ్ చేశారు. వీసీలు తప్పులు చేస్తే చర్యలు తీసుకోవాలన్నారు. బెదిరింపులాతో రాజీనామాలు చేయించడం విద్యా వ్యవస్థకు కళంకమని ఎమ్మెల్సీ అన్నారు. వీసీలుగా క్వాల్గి÷డ్ వాళ్ళను మాత్రమే నియమిస్తారని... దానికి ఒక కమిటి ఉందని తెలిపారు. వీసీలుగా క్వాల్గి÷డ్ కానీ వాళ్ళని నియమిస్తే విచారణ జరపాలన్నారు. ఉన్నత విద్యా శాఖ ఆదేశాలతో రాజీనామా చేయాలని ఆదేశించారని.. అన్న దానిపై విచారణ జరపాలని అడుగుతున్నామన్నారు.

# టీచర్ ఎమ్మెల్సీ కొమురయ్యకు బిజెపి అభినందనలు

**హైదరాబాద్, ఈ-కబురు:** ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన మల్క కొమరయ్యకు కేంద్ర మంత్రి, రాష్ట్ర భాజపా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రముఖ విద్యావేత్త, సామాజికవేత్త అయిన మల్క కొమరయ్య విజయానికి సహకరించిన ఉపాధ్యాయులకు, ఉపాధ్యాయ సంఘాలకు, తెలంగాణ ప్రజలకు భాజపా విజయానికి కృషిచేసిన కార్యకర్తలకు, ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఏ ఆకాంక్షల కోసమైతే, ఉపాధ్యాయులు భాజపాను గెలిపించారో.. వాటి సాధనకు పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులు ఇచ్చిన ఈ తీర్పు చరిత్రాత్మకమైనదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో లెక్కింపు కేంద్రం



వెలుపల భాజపా అభ్యర్థి మల్క కొమరయ్యను అభినందించారు. ఎమ్మెల్సీగా గెలిపించిన ప్రతి ఓటరుకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్, భారాస కుమ్మక్కై కుట్రలు చేసినా భాజపా అభ్యర్థి విజయం సాధించారన్నారు. ఉపాధ్యాయులకు హ్యాట్సాఫ్ అని చెప్పారు. 317 జీవో కోసం భాజపా చేసిన పోరాటం ఫలితంగా ఈ విజయం దక్కిందన్నారు. భాజపా నాయకులు కార్యకర్తలు గెలుపు సంబరాల్లో మునిగితేలారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ మేయర్ సునీల్‌రావు, తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, సంగప్ప తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక స్థానంలో పీఆర్‌టీయూ టీఎస్, మరో చోట భాజపా మద్దతుతో బరిలో దిగిన అభ్యర్థులు విజయం సాధించారు. ఉమ్మడి నల్గొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానంలో పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించగా; ఉమ్మడి కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో భాజపా మద్దతు పలికిన అభ్యర్థి మల్క కొమరయ్య గెలుపొందారు. ఈ రెండో చోట్లా సిటింగ్ అభ్యర్థులు ఓటమి పాలయ్యారు.

## మొదటి పేజీ తరువాయి

### వ్యవసాయంపై అవగాహనలేని సీఎం

కుటుంబానికి పరిహారం అందేదన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ పథకాలలో ఒకటి రైతు బీమా, రైతుబంధు అని యూఎన్‌ఓకు చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ సంస్థ ప్రకటించిందని గుర్తుచేవారు. రైతు బీమా పథకం ప్రవేశపెట్టిన తరువాత డిసెంబర్ 4, 2023 బీఆర్‌ఎస్ ప్రభుత్వం దిగిపోయే వరకు రాష్ట్రంలో 1,18,197 మంది రైతులు మరణించగా రూ.5,909.85 కోట్లు ఆ రైతు కుటుంబాలకు పరిహారంగా అందించడం జరిగిందని పేర్కొన్నారు. రైతు బీమా పథకం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.6122.65 కోట్లు ఎల్‌ఐసీకి ప్రీమియంగా చెల్లించిందని తెలిపారు. ఏడాదికి రూ.1500 కోట్లకు గాను రెండో విడత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.750 కోట్ల ప్రీమియం చెల్లించని కారణంగా ఏడు వేల పైచిలుకు కుటుంబాల పరిహారం పెండింగ్‌లో ఉన్నాయని నిరంజన్ రెడ్డి తెలిపారు. 15 నెలలలో 440కి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### నేటి నుంచి మీనాక్షి సమీక్షలు

నియమితులైన తరవాత మీనాక్షి నిర్వహించబోతున్న తొలి సమీక్ష సమావేశాలు కావడంతో నేతలంతా వీటికి ప్రాధాన్యమిస్తున్నారు. ప్రధానంగా ఎమ్మెల్యేలు ఎన్నుకునే ఎమ్మెల్సీ ఎన్నికలకు నలుగురు అభ్యర్థులను ఈ నెల 10లోగా పార్టీ ప్రకటించాల్సి ఉంది. పెద్దసంఖ్యలో నేతలు టికెట్లు ఆశిస్తున్నారు. వీటి కోసం కొత్త ఇన్‌ఛార్జిని ప్రసన్నం చేసుకునేందుకు, తమ పనితీరును వివరించేందుకు నేతలు సిద్ధమవుతున్నారు.

**సామాజిక వర్గాలవారీగా..**

ఇటీవల ఎస్సీ వర్గీకరణకు శాసనసభ ఆమోదం తెలిపినందున ఆ మేరకు ఇకముందు కాంగ్రెస్‌లో పదవుల భర్తీ కూడా ఉంటుందని నేతలు చెబుతున్నారు. ప్రధానంగా మాల, మాదిగ వర్గాల నేతలకు ఎమ్మెల్సీ టికెట్లు, నామినేటెడ్, మంత్రి పదవుల భర్తీలో ఎస్సీ వర్గీకరణ ప్రకారం ప్రాధాన్యమిస్తారని ప్రచారం జరుగుతోంది. తమకు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని రెండు సామాజిక వర్గాల నేతలు పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. వీరిలో ఒక వర్గానికి అవకాశమిస్తే మరో వర్గానికి ప్రభుత్వ సలహాదారు లేదా రాబోయే మంత్రివర్గ విస్తరణలో సర్దుబాటు చేయాలనే డిమాండు వినిపిస్తోంది. ఇక బీసీలకు ఎమ్మెల్సీ టికెట్లలో రెండు ఇవ్వాలని ఈ వర్గాల నేతలు పట్టుబడుతున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక పూర్తయితే ఏయే వర్గాలకు అవకాశం ఇస్తారనేది తేలుతుంది.

### నేటినుంచి ఇంటర్ పరీక్షలు

4,97,528 మంది ఉండగా.. అమ్మాయిలు 4,99,443 మంది ఉన్నారు. మొత్తం 1,532 కేంద్రాల్లో జరగనున్న పరీక్షల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు ఇంటర్ బోర్డ్ ప్రకటించింది. ఈసారి పరీక్షా కేంద్రాల గుర్తింపు కోసం హాల్ టిక్కెట్లపై క్యూర్ కోడ్‌లను సైతం ముద్రించటం విశేషం. ఇక పేపర్ లీకేజీ, మాస్ కాపీయింగ్ వంటి సమస్యలు తలెత్తకుండా సీసీ కెమెరా సర్వైలెన్స్, పెద్ద సంఖ్యలో స్క్వాడ్ లను సైతం ఏర్పాటు చేశామని ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య వివరించారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు బోర్డ్ సర్వం సిద్ధం చేసిందని అన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలు.. మార్చి 5వ తేదీ బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి.

# బీజేపీని నమ్మితే అమ్ముడు ఖాయం



**హైదరాబాద్, ఈ-కబురు:** బీజేపీని నమ్ముకుంటే చివరకు నడీరోడ్డుపై అమ్మేస్తారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాని తుక్కు కింద తెగనమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో సీసీఐని పునఃప్రారంభిస్తామని మాటిచ్చి, ఓట్లు, సీట్లు దండుకుని చివరికి స్క్రాప్ కింద అమ్మేస్తారా అంటూ నిలదీశారు. సీసీఐపైనే కోటి ఆశలు పెట్టుకుని ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న నిరసనలు కేంద్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా? వారి ఆర్తనాదాలు వినిపించడం లేదా మండిపడ్డారు. ఎంతో విలువైన యంత్ర పరికరాలను పాత ఇనుప సామాన్ల కింద లెక్కకట్టి ఆన్‌లైన్‌లో టెండర్లు పిలవడం, సీసీఐ సంస్థ గొంతు కోయడమేనన్నారు. నిర్మాణ రంగంలో సిమెంటుకున్న డిమాండ్ దృష్ట్యా సీసీఐని ప్రారంభించి కార్మికులను కాపాడాలని బీఆర్‌ఎస్ పదుల సార్లు కేంద్రమంత్రులకు మొరపెట్టుకున్నా కనికరించకపోవడం ఆదిలాబాద్‌కు వెన్నుపోటు పొడవడమేనని చెప్పారు. 772 ఎకరాల భూమి, 170 ఎకరాల్లో టౌన్ షిప్, 48 మిలియన్ లైమ్ స్టోన్ నిల్వలతో సకల వనరులున్న సంస్థను అంగడి సరుకుగా మార్చేసిన కేంద్రానికి ఉద్యోగులు, కార్మికుల గోస తగలక మానదన్నారు. ఈ అనాలోచిత నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకునే దాకా కార్మికులతో కలిసి ఉద్యమిస్తాం.. సంస్థ పరిరక్షణ కోసం ఎంతవరకైనా పోరాడతామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రోత్సాహం అందించి వాటిని ఆదుకోవాల్సిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అండగా నిలుస్తున్నది. అస్మదీయులకు ప్రభుత్వ సంస్థలను కట్టబెడుతూ ఉద్యోగులను రోడ్డుపాలు చేస్తున్నది. కార్పొరేట్‌కు అప్పగించే పనుల్లో భాగంగా ఆదిలాబాద్ సిమెంటు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ని ప్రభుత్వం అమ్మకానికి పెట్టేందుకు సిద్ధమైంది. ఈ మేరకు మూతబడిన సీసీఐ యంత్ర సామగ్రిని స్క్రాప్ కింద వేలం వేయడానికి టెండర్లను ఆహ్వానించింది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సిమెంటుకు డిమాండ్ భారీగా ఉంది. ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను ప్రారంభించడానికి అన్ని వనరులు ఉన్నాయి. సీసీఐని ప్రారంభిస్తే 2,500 మందికి ప్రత్యక్షంగా, మరో 2,500 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. సీసీఐని ప్రారంభించాలని గతంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేంద్రానికి పలుమార్లు విజ్ఞప్తి చేసింది. పరిశ్రమ పునఃప్రారంభానికి రాయితీలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జోగు రామన్నతో పాటు ఇతర బీఆర్‌ఎస్ నేతలు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండేలను కలిసి అనేకసార్లు వినతిపత్రాలు అందజేశారు. కానీ, మోదీ సర్కారు స్పందించలేదు. ఈ నేపథ్యంలో తాజాగా వేలాది మంది ఉపాధిని పట్టించుకోకుండా, స్థానికుల మనోభావాలను లెక్కచేయకుండా పరిశ్రమను కేంద్రం ప్రభుత్వం విక్రయించేందుకు చర్యలు చేపట్టింది. కేంద్రంలోని మోదీ సర్కారు ఈ పరిశ్రమను అమ్మేందుకు మూడేండ్ల నుంచి ప్రయత్నాలు చేస్తున్నది. మొదటిసారి స్క్రాప్ ఈ-వేలంలో భాగంగా 2022 మే 5న ఆన్‌లైన్‌లో బిడ్లను ఆహ్వానించింది. కేంద్రం నిర్ణయానికి వ్యతిరేకంగా బీజేపీ మినహా అన్ని పార్టీల నాయకులు అఖిలపక్షంగా ఏర్పడి ఆందోళనలు చేపట్టారు. దీంతో అప్పట్లో వేలం ప్రక్రియ నిలిచిపోయింది. మరోసారి ఈ టెండర్లను కేంద్రం పిలిచింది. ఈ నెల 7 నుంచి టెండర్లను ఆన్‌లైన్‌లో దాఖలు చేసుకోవచ్చని సూచించింది. మూతబడిన ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమలో 71 పరికరాలకు సంబంధించి వేలం ప్రారంభ ధర రూ.43.30 కోట్లు ఉంటుందని అధికారులు తెలియజేశారు. దీంతో జిల్లా వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఇంటర్ విద్యార్థులకు కేటీఆర్ శుభాకాంక్షలు**

ఇంటర్మీడియట్ పరీక్షలు నేటినుంచి(బుధవారం) ప్రారంభం కానున్న సందర్భంగా విద్యార్థులకు మాజీ మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షలకు హాజరువుతున్న విద్యార్థులు ఆత్మసైర్థ్యంతో పరీక్షలు రాయాలని సూచించారు. ఎటువంటి టెన్షన్‌కు లోనుకాకుండా అధికారులు నిర్దేశించిన సమయానికి అర్ధగంట ముందుగానే పరీక్షా హాల్‌కు చేరుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తగిన ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా ఉంటూ మీ వంతు కృషి చేయండి అని కేటీఆర్ సూచించారు.

## ప్రైవేట్ ఆస్పత్రులకు అనుకూలంగా ప్రభుత్వ విధానాలు

### బలవంతంగా మందులు అంటగడుతున్న ఆస్పత్రులు

### రాష్ట్రప్రభుత్వాల తీరుపై సుప్రీం ఆగ్రహం

**న్యూఢిల్లీ:** అందుబాటు ధరల్లో వైద్య సంరక్షణ, సదుపాయాలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే.. ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రోత్సాహకంగా మారిందని విమర్శించింది. ప్రైవేట్ ఆసుపత్రులన్నీ రోగులు, వారి బంధువులతో బలవంతంగా అధిక ధరలతో మందులు కొనుగోలు చేయిస్తున్నాయంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. తమ పార్మసీల నుంచి మందులు కొనుగోలు చేయాలంటూ.. రోగులను బలవంతం చేయకుండా ప్రైవేట్ ఆసుపత్రులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. వీటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తన పిటిషన్‌లో స్పష్టం చేశారు. దీంతో రోగులు దోపిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. అయితే పిటిషనర్ వాదనతో సుప్రీంకోర్టు ధర్మాసనం ఏకీభవించింది. రోగులకు సూచించిన ఔషధం వేరే పార్మసీలో స్వల్ప ధరకు లభ్యమవుతుంటే.. దానిని తమ పార్మసీలోనే కొనుగోలు చేయాలంటూ ప్రైవేట్ ఆసుపత్రులు రోగులపై ఒత్తిడి తీసుకు రాకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మాజంలోని పేద వర్గాలకు ప్రాణాధార మందులు అందుబాటు ధరల్లో లభించడం కష్టమై పోయిందంటూ వ్యాఖ్యానించింది. పౌరులు ఈ రకమైన దోపిడికి గురి కాకుండా రక్షించేందుకు తగిన మార్గ దర్శకాలను రూపొందించాలంటూ కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే గతంలో ఇదే అంశంపై పలు రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. వాటికి ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బిహార్, అరుణాచల్ ప్రదేశ్, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు స్పందించాయి. క్రమంలో కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేశాయి. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ధరల నియంత్రణపైనే తాము ఆధారపడతామని ఆయా రాష్ట్రాలు స్పష్టం చేశాయి. అత్యవసర మందులు అందుబాటు ధరల్లో లభ్యమయ్యేలా చూసేందుకు వాటి ధరలు నిర్ణయించినట్లు తెలిపాయి. అయితే ఆసుపత్రిలోనే మందులు కొనుగోలు చేయాలనే ఒత్తిడి ఏమి లేదని సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపింది.

## టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్సీ విజయోత్సవాలు

### మరో ఇద్దరి గెలుపుతో టిడిపికి తిరుగు లేదన్న లోకేశ్

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కువగా రెడ్‌బుక్‌పైనే చర్చ సాగుతోంది.. ఏపీలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని అంటూ వైసీపీ విమర్శిస్తోంది.. అయితే, రెడ్‌బుక్‌పై మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు మంత్రి నారా లోకేష్.. టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ విజయోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కూటమి నేతలతో కలిసి పాల్గొన్న ఆయన.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెడ్ బుక్ తన పని తాను చేసుకువెళ్తుందన్నారు.. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకునే పక్రియ స్టార్ అయ్యిందన్నారు.. అయితే, ఎవరినో వదిలేస్తాం అనే ఆలోచన మాత్రం వద్దు అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు లోకేష్.. ఇక, ఈవీఎం అయినా బ్యాలెట్ అయిన గెలుపు కూటమిదే అన్నారు. 9 నెలల్లో పార్టీని అధికారంలోకి తెచ్చిన ఘనత ఎన్టీఆర్‌ది.. ఇప్పుడు 9 నెలల పాలనలో సీఎం చంద్రబాబు విజయం సాధించారు.. భారీ మెజారిటీతో గెలిస్తేనే గెలుపు అని నేను ఆనాడే చెప్పాను.. ఇంకో ఇద్దరు నాయకులు మండలికి వస్తున్నారు. కౌన్సిల్ లో ఉన్న మొత్తం 5 గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలకు గాను అన్నింటినీ టీడీపీ కైవసం చేసుకుంది. భారీ మెజారిటీతో ఇంతటి విజయాన్ని అందించిన గ్రాడ్యుయేట్లకి, గెలుపు కోసం కష్టపడిన ఎమ్మెల్యేలకు, కూటమి నేతలకు, నా ప్రాణ సమానమైన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. పులివెందుల ఎమ్మెల్యే వన్ డే ఎమ్మెల్యే.. డిపాజిట్ రాదని కనీసం పోటీకి కూడా పెట్టలేదని ఎద్దేవా చేశారు.. జగన్ చేస్తున్న పనులకు, కొత్త పేరు పెట్టాం.. 'వన్ డే ఎమ్మెల్యే'.. ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా కోసం, ఒక రోజు అసెంబ్లీకి వచ్చి హడావిడి చేసి బెంగళూరు పారిపోతాడు అంటూ సెటైర్లు వేశారు మంత్రి నారా లోకేష్.

## రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు

### సీఎం సన్నిహితుడు వేంనరేందర్‌రెడ్డికి ఎమ్మెల్సీ చేయటానికి ప్రయత్నాలు

**హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకోబోతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత సన్నిహితుడైన వేం నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీ చేయడానికి కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ ఎన్నిక వెనుక ఉన్న కథను చూస్తే, ఇది కేవలం ఒక ఎమ్మెల్సీ పదవి కోసం జరిగే పోటీ కాదనిపిస్తుంది. కొన్ని దశాబ్దాల క్రితం ప్రారంభమైన స్నేహం, అరెస్టులు, రివెంజ్ ల సమాహారంగా కనిపిస్తోంది. 2015లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో 'ఓటుకు నోటు' కేసు సంచలనం సృష్టించింది. అప్పుడు రేవంత్ రెడ్డి తెలుగు దేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యేగా ఉండగా, వేం నరేందర్ రెడ్డి ఎమ్మెల్సీగా పోటీ చేశారు. ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురి చేయడం జరిగిందనే ఆరోపణలతో కేసు నమోదైంది. ఆ ఘటనలో రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లారు. వేం నరేందర్ రెడ్డి రాజకీయంగా వెనుకబడ్డారు. అయితే, రాజకీయ సమీకరణాలు మారిన తర్వాత రేవంత్ కాంగ్రెస్‌లో చేరగా, వేం నరేందర్ రెడ్డి కూడా అదే బాటలో నడిచారు. అప్పటి నుంచి వేం నరేందర్ రెడ్డి %-% రేవంత్ రెడ్డికి నీడలా ఉండి ఆయన్ని అనుసరించారు. ఆ తర్వాత మారిన పరిణామాలతో కాంగ్రెస్ లో చేరిన రేవంత్ వేంటే వేం కూడా చేరారు. అప్పటి నుండి పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇప్పుడు ముఖ్యమంత్రి ఈ కాలంలో మొత్తం రేవంత్ వేంటే నీడై నడిచారు వేం నరేందర్ రెడ్డి. కనీసం ఎమ్మెల్యే టిక్కెట్ కూడా అడగకుండా ఎన్నికలను దగ్గరుండి రేవంత్ యాక్షన్‌ను ప్లాన్ చేశారు. ఈలోపే ఎన్నికలు వచ్చాయి సీఎంగా రేవంత్ రెడ్డి భాద్యతలు చేపట్టారు. ఇక రేవంత్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి వేం నరేందర్ రెడ్డి చాలా కీలకంగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే వేం నరేందర్ రెడ్డిని ముఖ్యమంత్రి సలహాదారుగా నియమించారు. అప్పటి నుండి పార్టీతోపాటు, ప్రభుత్వ కార్యకలాపాలు, సీఎం యాక్టివిటి అంత వేం నరేందర్ రెడ్డి అన్ని తానై చూసుకుంటున్నారు. ఇక ఇప్పుడు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిపికేషన్ రావడంతో ఇప్పుడు అందరి చూపు వేం వైపు మళ్లింది. అయితే తాజాగా తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో.. కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ఖరారు చేయడానికి కసరత్తు ప్రారంభించింది. ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి బీఆర్ఎసకు వెళ్లే అవకాశముండగా, నాలుగింట్లో కాంగ్రెస్ పార్టీ పాగా వేయనుంది. దీంతో ఇప్పుడు స్నేహం కోసం అనే మాట మళ్లీ వినిపిస్తుంది. 5 ఎమ్మెల్సీలలో నాలుగు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ పార్టీకి రానున్నాయి. దీంతో ఇప్పుడు ఒక ఎమ్మెల్సీని వేం నరేందర్ రెడ్డికి ఇవ్వడం పక్కా అనే ప్రచారం జరుగుతుంది. వేం నరేందర్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి పెద్దల సభకు పంపడం ఖాయంగా కనిపిస్తోంది.

## కెసిఆర్ అసెంబ్లీకి రావడం లేదు

**హైదరాబాద్:** భారాస అధినేత, ఎమ్మెల్యే కేసీఆర్ అసెంబ్లీకి రావట్లేదంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. విజయ్‌పాల్‌రెడ్డి వేసిన ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యంపై కోర్టులో విచారణ జరిగింది. ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్.. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలను లేవనెత్తాల్సిన బాధ్యత ఆయనపై ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కొన్ని నెలలుగా ఆయన అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనడం లేదని, ఇలా సమావేశాలకు హాజరు కాకుంటే చట్టప్రకారం అనర్హుడిగా ప్రకటించవచ్చన్నారు. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేయాలని ధర్మాసనం ముందు వాదనలు వినిపించారు. కాగా.. ఈ వ్యాజ్యంలో జోక్యం చేసుకోవడానికి కోర్టు పరిధి ఏంటని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ పిల్‌కు అర్హత లేదని శాసనసభ వ్యవహారాల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు.







టిఎన్జీఓ కాలనీలో ఆక్రమ నిర్మాణాలను సీజ్ చేస్తున్న అధికారులు

# టిఎన్జీఓ కాలనీలో అక్రమ నిర్మాణాలు సీజ్

### 14 అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు తీసుకున్న జీహెచ్ఎంసీ

**ఈ-కబురు, శేరిలింగంపల్లి:** గచ్చిబౌలి ఐటీ కారిడార్ పరిధిలోని టీఎన్జీఓ కాలనీలో అనుమతి లేకుండా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. గ్రేటర్ ఖజానాకు గండికొడుతూ అక్రమంగా చేపడుతున్న బహుళ అంతస్థుల నిర్మాణాలను అధికారులు సీజ్ చేశారు. టిఎన్జీఓ కాలనీలో చేపడుతున్న అక్రమ నిర్మాణాల మీద చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించడంతో మంగళవారం మొత్తం 14 నిర్మాణాలను స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేసి సదరు నిర్మాణాలకు బ్యానర్లను కట్టారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... గచ్చిబౌలి ఐటి కారిడార్ పరిధిలోని ఉమ్మడి రాష్ట్ర హయాంలో ప్రభుత్వ సెక్రెటేరియేట్ ఉద్యోగులు, తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారులు, హైకోర్టు ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన ఉద్యోగుల కోసం టిఎన్జిఓ కాలనీని ఏర్పాటు చేసి ఇళ్ల స్థలాలను మంజూరు చేశారు. కాగా ఇక్కడి స్థలాల్లో గతకొంత కాలంగా ఆక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. జీహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి ఎటువంటి అనుమతి తీసుకోకుండా కొన్ని నిర్మాణాలు చేపడుతుండగా, కేవలం జి ప్లస్ టూ అనుమతి తీసుకొని ఏకంగా ఆరు, ఏడు అంతస్థుల నిర్మాణాలు చేపడుతున్నారు. పూర్తిగా రెసిడెన్షియల్ అనుమతి ఉన్న ఈ కాలనీలో కమర్షియల్, వాణిజ్య భవనాలను నిర్మించి పలు హోటళ్లు, దుకాణాలు, వర్కింగ్ హస్టళ్లు, కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నారు. టిఎన్జిఓ కాలనీ అక్రమ నిర్మాణాలపై గతంలో పలు పిర్యాదులు రావడంతో పాటు కొందరు సదరు ఆక్రమ నిర్మాణాలపై కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు గతంలోనే ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు టిఎన్జిఓ కాలనీలో అక్రమ నిర్మాణాలపై చర్యలకు ఉపక్రమించిన శేరిలింగంపల్లి టౌన్ ప్లానింగ్ అధికారులు కాలనీ వ్యాప్తంగా సర్వే నిర్వహించి అక్రమ నిర్మాణాలను గుర్తించారు. ఈమేరకు మంగళవారం 14 అక్రమ నిర్మాణాలను సీజ్ చేశారు. సదరు భవనాల ముందు బ్యాక్టర్లను కట్టి, గేట్లకు తాళాలు వేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ అధికారులు మాట్లాడుతూ టిఎన్జిఓ కాలనీలో అక్రమ నిర్మాణాలపై గతంలోనే నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నోటీసులకు నిర్మాణదారులు స్పందించకుండా నిర్మాణాలు చేపట్టడంతో సదరు నిర్మాణాలను సీజ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని, సీజ్ చేసిన భవనాల్లో పనులు చేపడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు

### సీఎం సన్నిహితుడు వేంనరేందర్‌రెడ్డికి ఎమ్మెల్సీ చేయటానికి ప్రయత్నాలు

**హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకోబోతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత సన్నిహితుడైన వేం నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీ చేయడానికి కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ ఎన్నిక వెనుక ఉన్న కథను చూస్తే, ఇది కేవలం ఒక ఎమ్మెల్సీ పదవి కోసం జరిగే పోటీ కాదనిపిస్తుంది. కొన్ని దశాబ్దాల క్రితం ప్రారంభమైన స్నేహం, అరెస్టులు, రివెంజ్ ల సమాహారంగా కనిపిస్తోంది. 2015లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో 'ఓటుకు నోటు' కేసు సంచలనం సృష్టించింది. అప్పుడు రేవంత్ రెడ్డి తెలుగు దేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యేగా ఉండగా, వేం నరేందర్ రెడ్డి ఎమ్మెల్సీగా పోటీ చేశారు. ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురి చేయడం జరిగిందనే ఆరోపణలతో కేసు నమోదైంది. ఆ ఘటనలో రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లారు. వేం నరేందర్ రెడ్డి రాజకీయంగా వెనుకబడ్డారు. అయితే, రాజకీయ సమీకరణాలు మారిన తర్వాత రేవంత్ కాంగ్రెస్‌లో చేరగా, వేం నరేందర్ రెడ్డి కూడా అదే బాటలో నడిచారు. అప్పటి నుంచి వేం నరేందర్ రెడ్డి %-% రేవంత్ రెడ్డికి నీడలా ఉండి ఆయన్ని అనుసరించారు. ఆ తర్వాత మారిన పరిణామాలతో కాంగ్రెస్ లో చేరిన రేవంత్ వేంటే వేం కూడా చేరారు. అప్పటి నుండి పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇప్పుడు ముఖ్యమంత్రి ఈ కాలంలో మొత్తం రేవంత్ వేంటే నీడై నడిచారు వేం నరేందర్ రెడ్డి. కనీసం ఎమ్మెల్యే టిక్కెట్ కూడా అడగకుండా ఎన్నికలను దగ్గరుండి రేవంత్ యాక్షన్‌ను ప్లాన్ చేశారు. ఈలోపే ఎన్నికలు వచ్చాయి సీఎంగా రేవంత్ రెడ్డి భాద్యతలు చేపట్టారు. ఇక రేవంత్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి వేం నరేందర్ రెడ్డి చాలా కీలకంగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే వేం నరేందర్ రెడ్డిని ముఖ్యమంత్రి సలహాదారుగా నియమించారు. అప్పటి నుండి పార్టీతోపాటు, ప్రభుత్వ కార్యకలాపాలు, సీఎం యాక్టివిటి అంత వేం నరేందర్ రెడ్డి అన్ని తానై చూసుకుంటున్నారు. ఇక ఇప్పుడు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిపికేషన్ రావడంతో ఇప్పుడు అందరి చూపు వేం వైపు మళ్లింది. అయితే తాజాగా తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో.. కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ఖరారు చేయడానికి కసరత్తు ప్రారంభించింది. ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి బీఆర్ఎసకు వెళ్లే అవకాశముండగా, నాలుగింట్లో కాంగ్రెస్ పార్టీ పాగా వేయనుంది. దీంతో ఇప్పుడు స్నేహం కోసం అనే మాట మళ్లీ వినిపిస్తుంది. 5 ఎమ్మెల్సీలలో నాలుగు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ పార్టీకి రానున్నాయి. దీంతో ఇప్పుడు ఒక ఎమ్మెల్సీని వేం నరేందర్ రెడ్డికి ఇవ్వడం పక్కా అనే ప్రచారం జరుగుతుంది. వేం నరేందర్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి పెద్దల సభకు పంపడం ఖాయంగా కనిపిస్తోంది.

## బిజెపి రాష్ట్ర కార్యాలయంలో విజయోత్సవాలు

### రేవంత్ పతనం మొదలయ్యిందన్న లక్ష్మణ్

**హైదరాబాద్:** కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, మెదక్ టీచర్ ఎమ్మెల్సీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య విజయం సాధించిన నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఎదుట సంబరాలు వెల్లివిరిశాయి. ఈ కార్యక్రమంలో మల్క కొమురయ్యతో పాటు బీజేపీ రాజ్యసభ సభ్యులు కే.లక్ష్మణ్, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొని విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు కే.లక్ష్మణ్ మాట్లాడుతూ.. మల్క కొమురయ్య గెలుపుతో రేవంత్ సర్కార్ పతనానికి నాంది పడ్డట్లు వ్యాఖ్యానించారు. 317 జీవోపై బీజేపీ అలుపెరగని పోరాటం చేసిందని గుర్తుచేశారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో మల్క కొమురయ్య మండలిలో వినిపిస్తారని అన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పరిస్థితులు దయనీయంగా ఉన్నాయని, ఉపాధ్యాయుల ఆవేదన ప్రభుత్వానికి తీవ్ర ఝలక్ ఇస్తుందని హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రాబోతోందనడానికి నిదర్శనమని కే.లక్ష్మణ్ స్పష్టం చేశారు. బీజేపీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, పార్టీపై ఎదురు దాడులు చేయడం తగదని అన్నారు. తెలంగాణ ఆకాంక్షలను నెరవేర్చేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని ఆయన వివరించారు. ఇక ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడుతూ.. తన విజయంలో కీలక పాత్ర పోషించిన కేంద్ర, రాష్ట్ర పార్టీ నాయకత్వాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఎన్నికల్లో తనపై జరిగిన దుష్ప్రచారాలను తిప్పికొట్టిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు చెప్పారు. తనను కార్పొరేట్ అభ్యర్థిగా ప్రచారం చేశారని.. కానీ, తాను ఎడ్యుకేషన్ సిస్టమ్ మీద పూర్తి పట్టుదలతో ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. 317 జీవో చాలా దుర్మార్గమైనదని, దానిపై తమ పోరాటం కొనసాగుతుందని మల్క కొమురయ్య హామీ ఇచ్చారు. విద్యాశాఖలో అనేక సమస్యలు ఉన్నాయని, ఉపాధ్యాయులు సతమతమవుతున్నారని, దానితో పిల్లలకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి ఎప్పుడూ అండగా ఉంటానని ఆయన అన్నారు. వీలైనంతవరకు ఉపాధ్యాయులతోనే ఉంటానని మల్క కొమురయ్య తెలిపారు.

## అంబులెన్స్‌ను తనిఖీ చేసిన పోలీసులు

### వాహనాన్ని సీజ్ చేసిన పోలీసులు

**హైదరాబాద్:** అంబులెన్స్ సైరన్ వినిపిస్తే.. ఎవరైనా సరే సైడ్ ఇస్తారు. ఎందుకంటే అందులోని బాధితుడు.. త్వరగా ఆస్పత్రికి వెళ్తే.. ప్రాణం నిలబడుతుందేమో ఆశ. అయితే అంబులెన్స్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారు కొందరు. అత్యవసర సమయాల్లో రోగులను ఆస్పత్రులకు చేర్చి ప్రాణాలు కాపాడే అంబులెన్స్‌లను కొందరు తప్పుగా ఉపయోగిస్తున్నారు. వాటిని నడిపిస్తున్న డ్రైవర్లు, నిర్వాహకులు అంబులెన్స్‌ల ముసుగులో దందాలు చేస్తున్నారు. లోపల ఎవరు రోగులు లేకున్నా.. సైరన్ వేసుకుని ట్రాఫిక్ నిబంధనలను దుర్వినియోగం చేస్తున్నారు. దీంతో అంబులెన్స్‌లపై పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. దీంతో షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. సైరన్ వేసుకొని కుక్కల్ని తీసుకెళ్తున్న అంబులెన్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. హిమాయత్ నగర్ నుంచి మదినగూడ వైపు వెళ్తుండగా పంజాగుట్ట దగ్గర ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. పంజాగుట్ట ఏసీపీ హరిప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. అంబులెన్స్ పేరుతో.. లోపల ఎలాంటి రోగులు లేకున్నా.. సైరన్ వేసుకుని ఎంచక్కా వెళ్లిపోతున్నట్లు పోలీసులు గుర్తించారు. అంబులెన్స్ వాహనాలకు ట్రాఫిక్ నిబంధనల నుంచి మినహాయింపు కల్పించటంతో.. దాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. గతంలో మిర్చి బజ్జి తినేందుకు అంబులెన్స్ డ్రైవర్ సైరన్ వేసుకొని వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పుడు కుక్కలను తీసుకె ళ్తున్న అంబులెన్స్‌ను పంజాగుట్ట ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేశారు.

# గతంలో ఎప్పుడూ ఇలా విసిలను బెదరించలేదు

## సభలో ఆధారాలు చూపినా చర్చకు ముందుకు రాలే

### ప్రభుత్వం తోకముడించదన్న మండలిలో విపక్షనేత బొత్స



**అమరావతి:** రాష్ట్రంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ల బలవంతపు రాజీనామాలపై విచారణకు సవాల్ చేసిన ప్రభుత్వం తీరా మండలిలో ఆధారాలు చూపగానే తోకముడిచిందని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. అసెంబ్లీ బయట మీడియా పాయింట్‌లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలతో కలిసి ఆయన మాట్లాడుతూ వీసీలతో బలవతంగా రాజీనామాలు చేయించారనే ఆరోపణలపై విచారణకు సిద్ధమంటూ సవాల్ చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధారాలు చూపగానే ఎందుకు వెనక్కివెళ్ళారో చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో స్వాతంత్రం వచ్చిన తరువాత ఎక్కడా, ఎప్పుడూ ఇలా వీసీలను బెదిరించి రాజీనామాలు చేయించిన ఘటనలు లేవని అన్నారు. గవర్నర్ నియమించిన విసిలని ఉన్నత విద్యా శాఖ మండలి చైర్మన్, కార్యదర్శులు ఏ విధంగా రాజీనామాలు చేయమని ఆదేశిస్తారు? ఒకేసారి 17 మంది వీసీలు రాజీనామా చేయడంపై జ్యుడీషియల్ విచారణ జరపాలని కోరాం. దీనిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధారాలు చూపాలంటూ సవాల్ విసిరారు. తీరా సభలో అన్ని వివరాలను ముందుంచడంతో, దానిపై సమాధానం చెప్పలేక దబాయింపులు, బుకాయింపులకు దిగారు. పరుష పదజాలంతో దూషణలకు తెగబడ్డారు. వీసీలు తప్పు చేస్తే విచారించండి, వారిపై చర్యలు తీసుకోండి, ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ ప్రభుత్వం మారగానే వైస్ ఛాన్సలర్లతో బలవంతంగా రాజీనామాలు చేయించడం దారుణం. ఇది మొత్తం విద్యా వ్యవస్థకే కళంకం అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ అనేది ఈ రాష్ట్రానికి జీవనాడి. ఈ ప్రాజెక్ట్ పేరు చెప్పగానే వైఎస్సార్ గుర్తుకు వస్తారు. ఈ ప్రాజెక్ట్‌ను 45.72 మీటర్లతో నిర్మించిప్పుడే విద్యుత్ ఉత్పత్తి, విశాఖ స్టీల్ ఎ÷-లాంట్‌కు నీరు, ఉత్తరాంధ్రకు తాగునీరు అందుతాయి. కానీ ప్రభుత్వం పోలవరం ఎత్తును 41.15 మీటర్లకే పరిమితం చేస్తోంది. పోలవరం ప్రాజెక్ట్‌ను కేంద్రమే నిర్మించి ఇవ్వాలి. కానీ చంద్రబాబు మాత్రం తన స్వలాభం కోసం కాంట్రాక్టర్ల కోసం తామే నిర్మిస్తామని బాధ్యత తీసుకున్నారు. చివరికి పోలవరం ఎత్తుపైన కూడా చంద్రబాబు రాజీ పడుతున్నారు. రికార్డులను పరిశీలిస్తే ఇందులో వాస్తవాలు బయటపడతాయి. దీనిపై వివరణ ఇవ్వాలని మండలిలో ప్రభుత్వాన్ని నిలదీశాం. కానీ ప్రభుత్వం నుంచి దీనిపై సూటిగా సమాధానం రాలేదు. పోలవరం ఎత్తును తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందని అర్థమవుతోంది. వైఎస్సార్‌సీపీగా దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించం అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో చేనేత కార్మికులను గాలికి వదిలేసింది. దీనిపై మండలిలో ప్రశ్నిస్తే శవాల మీద పేలాలు ఏరుకుంటున్నారంటూ మాపై ప్రభుత్వం ఎదురుదాడి చేస్తోంది. బీసీల గురించి మాట్లాడితే ఇలాంటి నీచమైన వ్యాఖ్యలు చేస్తారా? చేనేత కార్మికుల కోసం రూ.వెయ్యి కోట్ల నిధిని పెడతానని మోసం చేసిన ఘనత చంద్రబాబుది. 2019-24 మధ్య వైయస్ఆర్ నేతన్న నేస్తం కింద రూ.960 కోట్లు నేతన్నలకు ఇచ్చాం. రూ.1396 కోట్లు వారి పెన్షన్‌ల కోసం ఖర్చు చేశాం. కానీ కూటమి ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం కోసం అంటూ అంకెల గారడీతో ప్రచారం చేసుకుంటోంది. తమకు అనుకూలమైన మాధ్యమాల్లో లేనిది ఉన్నట్లుగా చాటుకుంటోంది. బలహీనవర్గాల విషయంలో న్యాయం చేయకపోగా వారిని కించపరిచేలా మాట్లాడుతున్నారు. సంక్షోభంలో ఉన్న విద్యుత్ డిస్కామ్ లు వాటిని కాపాడటానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 47వేల కోట్లు ఖర్చు పెట్టింది. ట్రూఅప్ చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలపై వేసిన రూ.15 వేల కోట్ల ప్రభారాన్ని ప్రభుత్వమే భరించాలి. 2014-19 లో తెలుగుదేశం ప్రభుత్వం చేసిన అప్పుల్లో కనీసం మూడోవంతు కూడా మా హయాంలో చేయలేదు. రాష్ట్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎక్కడా మా పార్టీ అభ్యర్థులు పోటీ చేయలేదు. కూటమి నిలబెట్టిన అభ్యర్థులకు మేం వ్యతిరేకమని మాత్రమే చెప్పాం. ఎవరికీ మద్దతు ప్రకటించలేదు. రిగ్గింగ్‌లు, డబ్బు పంపిణీ, అధికార దుర్వినియోగంతో కూటమి అభ్యర్థులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచారు. ఉత్తరాంధ్రలో రఘువర్మ తమ అభ్యర్థి అంటూ కూటమి నేతలు ప్రచారం చేసుకున్నారు. ఇప్పుడు ఆయనక బదులు గెలిచిన శ్రీనివాసులు నాయుడిని తమ అభ్యర్థి అంటూ చెప్పుకోవడం దారుణం. ఎవరికో పుట్టిన పిల్లవాడిని తమ కొడుకు అని చెప్పుకుంటున్నట్లుగా ఉందన్నారు.

## పులిపిల్లలతో సరదాగా గడిపిన ప్రధాని

### పాలుపట్టి వాటితో ప్రేమ ప్రకటించిన మోడీ

### వంతారాలో పర్యటించి వివరాలు తెలుసుకున్న ప్రధాని

**జామ్‌నగర్:** పులిపిల్లలతో ప్రధాని మోడీ సరదాగా గడిపారు. వాటికి పాలు పట్టి తన ప్రేమను చాటారు. వంతారాలో పునరావాసం పొందుతున్న వివిధ జాతుల జంతువులతో ప్రధాని సన్నిహితంగా మెలిగారు. అక్కడ సింహాల పిల్లలకు , జిరాఫీలకు ఆహారం అందించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. గాయపడిన, ఇబ్బందుల్లో ఉన్న జంతువులను సంరక్షించే లక్ష్యంతో 'వంతారా' కార్యక్రమాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, రిలయన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ అనంత్ అంబానీ ప్రారంభించారు. వన్యప్రాణుల రక్షణ, పునరావాసం, సంరక్షణ కేంద్రమైన ఈ వంతారాను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సందర్శించారు. ప్రధాని మోదీ ప్రస్తుతం తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. సోమవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా గిర్ అడవుల్లో సఫారీకి వెళ్లారు. మంగళవారం జామ్‌నగర్‌లోని వంతారాను సందర్శించారు. వన్యప్రాణుల ఆసుపత్రిని, జంతువుల కోసం ఏర్పాటు చేసిన పశువైద్య సౌకర్యాలను వీక్షించారు. అంతే కాకుండా వైల్డ్‌లైఫ్ అనస్థీషియా, కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఎండోస్కోపీ, డెంటిస్ట్రీ, ఇంటర్నల్ మెడిసిన్ మొదలైన అనేక విభాగాలను కూడా పరిశీలించారు. దేశ, విదేశాల్లో గాయపడిన, ప్రమాదంలో చిక్కుకున్న జంతువులను కాపాడి, చికిత్స చేసి, సంరక్షించి, పునరావాసం కల్పించడం 'వంతారా' ముఖ్య లక్ష్యం. వంతారా అనేది కృత్రిమ అడవి. గుజరాత్‌లోని జామ్‌నగర్ రిలయన్స్ రి÷నైరీ కాంప్లెక్స్‌లో 3 వేల ఎకరాల్లో ఇది ఉన్నది. ఈ అడవిలో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏనుగుల కోసం ప్రత్యేకంగా దవాఖాన ఉంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్దది. ఇందులో దాదాపు 2వేల వన్యప్రాణులను సంరక్షిస్తున్నారు. వేల సంఖ్యలో ఉద్యోగులు కూడా పనిచేస్తున్నారు.

## స్పీకర్‌కు హరీశ్‌రావు లేఖ

**హైదరాబాద్:** రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖ రాశారు. నక్షత్రం గుర్తు లేని ప్రశ్నలకు ఇప్పటి వరకు ఎందుకు సమాధానాలు ఇవ్వలేదని స్పీకర్‌ను హరీశ్‌రావు ప్రశ్నించారు. నక్షత్రం గుర్తు లేని ప్రశ్నలకు అసెంబ్లీ బిజినెస్ రూల్స్ 52(10) ప్రకారం.. రాతపూర్వ సమాధానాలు టేబుల్‌పై ఉంచాలని గుర్తు చేశారు. గత అసెంబ్లీలో అడిగిన ప్రశ్నలకు ఇప్పటి వరకు సమాధానం రాలేదని హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్ర నియోజకవర్గ ప్రయోజనాల కోసం సభలో ప్రశ్నలు అడగడం, సకాలంలో సమాధానాలు పొందడం సభ్యుల హక్కు అని ఆయన స్పష్టం చేశారు. తాము అడిగిన ప్రశ్నలకు వెంటనే సమాధానం ఇచ్చేలా అధికారులను ఆదేశించాలని స్పీకర్‌ను హరీశ్‌రావు కోరారు.

# కొనసాగుతున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ లెక్కింపు

## టీచర్ ఎమ్మెల్సీలుగాశ్రీపాల్ రెడ్డి, మల్క కొమురయ్యల గెలుపు

### బిజెపి ఖాతాలో ఒక్కసీటు పడడంతో పార్టీలో జోష్

**హైదరాబాద్:** తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా.. రెండు చోట్ల ఫలితం తేలిపోయింది. నల్గొండ, ఖమ్మం, వరంగల్ టీచర్ల ఎమ్మెల్సీ స్థానంలో పీఆర్‌టీయూ నేత శ్రీపాల్ రెడ్డి గెలవగా.. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీగా బీజేపీ బలపర్చిన మల్క కొమరయ్య విజయం సాధించారు. ఇక కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల స్థానానికి జరిగిన ఎన్నికకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. తుది ఫలితం రావడానికి అర్ధరాత్రి అయ్యే అవకాశం ఉంది. పట్టభద్రులు ఎవరికి పట్టం కట్టారనేది ఉత్కంఠ రేపుతోంది. బ్యాలెట్ పేపర్లు కట్టే సమయంలో కౌంటింగ్ ఏజెంట్లు చూడగా మొదటి ప్రాధాన్యత ఓట్లు బీజేపీ అభ్యర్థికి ఎక్కువ పడ్డాయనే ప్రచారం జరుగుతోంది. మొదటి ప్రాధాన్యత ఓట్లు అంజిరెడ్డికి ఎక్కువ పడ్డాయని, ఆ తర్వాత స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి ఉంటారని, మూడో స్థానంలో బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ ఉండే అవకాశం ఉంటుందనే చర్చ జరుగుతోంది. తొలి ప్రాధాన్యత ఓటులో ఏ అభ్యర్థి కోటా ఓట్లు సాధించే అవకాశం లేదని, ఈక్రమంలో రెండో ప్రాధాన్యత ఓటు కీలకం కానుందనే చర్చ జరుగుతోంది. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో త్రిముఖ పోటీ నెలకొంది. పోలింగ్ పూర్తైన తర్వాత బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ గెలుస్తారని చాలామంది అంచనా వేశారు. బ్యాలెట్ బాక్సులు తెరిచిచూస్తే మాత్రం ప్రసన్న హరికృష్ణ మూడో స్థానానికి పరిమితమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు సంబంధించి మొదటి ప్రాధాన్యత ఓట్లు బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి పడినట్లు తెలుస్తోంది. కరీంనగర్‌లో ఎవరు ఎక్కువ ఓట్లు సాధిస్తే వారికి విజయవకాశాలు ఎక్కువుగా ఉండే ఛాన్స్ ఉంది. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సమయానికి ప్రసన్న హరికృష్ణ మూడోస్థానంలో ఉంటే.. ఆయన ఎలిమినేషన్ ద్వారానే విజేత తేలే అవకాశం ఉంటుంది. అలా కాకుండా కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల్లో ఎవరైనా రెండు, మూడు స్థానాల్లో ఉంటే మూడో స్థానంలో ఉన్న అభ్యర్థి ఎలిమినేషన్ ద్వారా విజేత తేలే అవకాశం ఉంటుంది. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ మధ్య పోటీ ఉంటుందని భావించారు. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి గణనీయంగా ఓట్లు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ మూడో స్థానంలో ఉండవచ్చనే అంచనాలు వెలువడ్డాయి. కానీ ఎవరూ ఊహించని విధంగా బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటీఉందని ఈ ఇద్దరు అభ్యర్థుల్లో ఎవరైనా గలియే అవకాశాలు ఉన్నట్లు తెలిస్తోంది.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ కానుక

## మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ అద్దె బస్సులు

### జీవో జారీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

**హైదరాబాద్:** అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా తెలంగాణ మహిళ సమాఖ్యలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. మహిళా సంఘాలకు స్వయం ఉపాధిలో భాగంగా ఆర్టీసీ అద్దె బస్సులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం అందుకు సంబంధించిన జీవోను రేవంత్ సర్కార్ జారీ చేసింది. తొలి విడతలో 150 మహిళా సమాఖ్యలకు 150 ఆర్టీసీ బస్సులు కేటాయించనున్నారు. ప్రతి నెల ఒక్కో బస్సుకు అద్దె కింద రూ. 77,220 చెల్లించనుంది. ఇక బస్సుల కొనుగోలు కోసం మహిళా సంఘాలకు బ్యాంకు గ్యారంటీ సైతం ప్రభుత్వం ఇవ్వనుంది. దీంతో దేశంలోనే తొలిసారిగా మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సులను నడపనున్నాయి. ఆ రోజు సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఆయన కేబినెట్ మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్ని.. ఈ బస్సులను ప్రారంభించనున్నారు. ఆ తర్వాత మిగిలిన మండల సమాఖ్యలకు 450 ఆర్టీసీ అ÷-దదె బస్సులను కేటాయించనున్నారు. మరోవైపు సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరిట మహాలక్ష్మి పథకాన్ని చేపట్టారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తు?న్నారు. అయితే ఈ పథకం వల్ల రాష్ట్రంలోని మహిళలు.. ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఇక అంతకు ముందు కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఉచిత బస్సు ప్రయాణాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.

# అన్ని రంగాలను పట్టాలకెక్కించేలా కేటాయింపులు

**అమరావతి:** బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సంతృప్తి కలిగేలా, అన్ని రంగాలను ముందుకు తీసుకుని వెళ్లేలా సమతూకంతో కేటాయింపులు చేపట్టామని,ఎంత క్లిష్ట పరిస్థితుల్లో బడ్జెట్ వచ్చిందనేది అందరూ గుర్తించారని, కానీ, అసెంబ్లీకి రాని శాసనసభ్యులు మాత్రం బయట ఉండి విమర్శలు చేస్తున్నారని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైకాపా నేతల తీరుపై మండిపడ్డారు. కొందరు సభకు రాకుండా ఉన్నవి లేనివి కల్పించి ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. చేసిన పాపాలు వెంటాడటం వల్లే వారు అసెంబ్లీకి రాలేకపోతున్నారన్నారు. గత లోపాలు ఎత్తి చూపుతారనే శాసనసభకు ముఖం చాటేస్తున్నారు. రాష్ట్రంలో ఐదేళ్లపాటు ఆర్థిక విధ్వంసం సృష్టించారు. విలువలు వదిలేసి ప్రతిపక్షాల గొంతు నొక్కడంపైనే దృష్టిపెట్టారు. పేదోడి బువ్వ లాక్కున్నందునే వారు 11 స్థానాలకు పరిమితమయ్యారు. వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించలేదని చెబుతున్నారు.. కానీ, గతంలోనే ప్రాజెక్టు పూర్తయింది.. జాతికి అంకితం చేసినట్లు ప్రచారం చేశారు. పూర్తయిన ప్రాజెక్టుకు ఏం కేటాయింపులు చేయాలి? ఇదేం ద్వంద్వ వైఖరని మంత్రి ప్రశ్నించారు. వైసీపీపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో సంచలన కామెంట్లు చేశారు. అలాగే రాష్ట్ర పరిస్థితిపై ప్రజెంటేషన్ ఇచ్చారు. అంతే కాకుండా నాటి, నేటి ప్రభుత్వాల మధ్య తేడాలను చెప్పారు. బాలయ్య డైలాగ్స్ చెబుతూ ఇరు ప్రభుత్వాల మధ్య వ్యత్యాసాలను సభ ముందు ఉంచారు. వైసీపీ సమాజానికి హానికరం అంటూ కామెంట్స్ చేశారు. సిగరెట్ పెట్టెల మీద స్టాట్యూరీ వార్నింగ్ ఇచ్చినట్టుగా.. వైసీపీ సమాజానికి హానీకరం అంటూ పదే పదే చెప్పాల్సిన బాధ్యత తమసపై ఉందన్నారు. సభకు రాకుండా డ్రాప్ అవుట్ ఎమ్మెల్యేలు బయట కూర్చొని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం గురించి పదే పదే ప్రస్తావించడం దేనికని ప్రశ్నిస్తున్నారన్నారు. వైసీపీ హానికరం అనే విషయాన్ని ఇప్పటికే ప్రజలు గుర్తించారని.. అందుకే ఆ పార్టీని 11 స్థానాలకు పరిమితం చేశారని తెలిపారు. ప్రజలు కూటమికి అనుకూలంగా అద్భుతమైన తీర్పు ఇచ్చారని చెప్పుకొచ్చారు. మీరు అనుమతిస్తే నా సమయం తగ్గించుకొని వైసీపీ వారు ఏం మాట్లాడుతారో మాట్లాడమనండి. జీత భత్యాలు, అప్పులు, వడ్డీలకు వచ్చే ఆదాయం సరిపోతుంది అది కూడా 1శాతం లోటు ఉంది ... దీనిలో కమిటెడ్ ఎక్సపెండీచర్ చూపలేదు. అప్పు చేయడం తప్పుకాదు... చేసిన అప్పు క్యాపిటల్ ఇన్వెష్టమెంట్‌లో చేయాలి... ప్రోడక్టవిటీ పెంచాలి. చంద్రబాబు ఉన్నప్పుడు వ్యవసాయ రంగం 16 శాతం.... సేవల రంగం 12 శాతం ఉండగా.. . జగన్ వచ్చాక వ్యవసాయం, సేవల రంగం 3 శాతానికి పడిపోయింది. ఈ మూడు శాతం ఉంటే 76 వేల కోట్లు అదనంగా వచ్చేది. అధికారులను అందరికి ఇదే డైరెక్షన్‌లో ముందుకు వెళ్లే లా చూడాలిని కోరుతున్నా. అప్పుపుట్టే సామర్థ్యం పెరిగితే ప్రాజెక్టులపై పెట్టుబడి పెట్టే శక్తి పెరుగుతుంది.

## ఎడిసి అధికారులతో ప్రపంచబ్యాంక్ బృందం భేటీ

**అమరావతి:** ఏపీ రాజధాని అమరావతిలో ప్రపంచ బ్యాంకు రుణంతో చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలపై అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) అధికారులతో ప్రపంచబ్యాంకు బృందం సమావేశమైంది. ఏడీసీ సీఎండీ డి.లక్ష్మీపార్థ సారథితో బ్యాంకు ప్రతినిధులు .. రుణం మంజూరు చేస్తున్న ప్రాజెక్టు నిర్మాణాలపై చర్చించారు. ముఖ్యంగా అమరావతి నగరానికి కావాల్సిన తాగునీటి సరఫరాపై చర్చ జరిగింది. తాగునీటి సరఫరా వ్యవస్థకు చేపడుతున్న ముఖ్యమైన మౌలిక సదుపాయాల రూపకల్పనపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజధానిలో నివసించే ప్రజలకు తాగునీటి లభ్యతకు గల అవకాశాలతో పాటు, నీటిని శుద్ధి చేసి పంపిణీ చేసే వ్యవస్థపై ఏడీసీ అధికారులు ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు వివరించారు. వాటర్ ట్రీట్మెంట్ ఎ÷-లాంట్లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి టెండర్లు రూపొందించినట్టు సీఎండీ.. బ్యాంకు ప్రతినిధులకు స్పష్టం చేశారు.

## కొనసాగుతున్న పట్టభద్ర ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

**కరీంనగర్:** కరీంనగర్-నిజామాబాద్-మెదక్-ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉత్కంఠగా కొనసాగుతోంది. ఇప్పటికి వరకు 3 రౌండ్లలో 63వేల ఓట్లను అధికారులు లెక్కించారు. భాజపా అభ్యర్థి అంజిరెడ్డి ఆధిక్యంలో ఉన్నారు. భాజపా అభ్యర్థికి 23,310 ఓట్లు రాగా.. సమీప కాంగ్రెస్ అభ్యర్థికి 18,812 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు 15,880 ఓట్లు పోలయ్యాయి. ప్రస్తుతం అంజిరెడ్డి 4,498 ఓట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఇంకా దాదాపు 1,33,000 వేల ఓట్లు లెక్కించాల్సి ఉంది. ఏ అభ్యర్థి అయినా విజయం సాధించాలంటే 1,12,000 ఓట్లు రావాల్సి ఉంటుంది. ఇదే ట్రెండ్ కొనసాగితే మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుతో ఫలితం తేలే అవకాశం లేదు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో విజయం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

## 15కిలోల బంగారం తరలింపు

**బెంగళూరు:** బంగారాన్ని అక్రమంగా తీసుకొచ్చారనే కారణంతో కన్నడ నటి రాన్యా రావ్ అరెస్టు అయ్యారు. దుబాయ్ నుంచి ఆమె తీసుకొచ్చిన దాదాపు 15 కేజీల బంగారాన్ని బెంగళూరు విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాన్యా ఇటీవల తరచూ దుబాయ్ వెళ్లి వస్తుండడంతో ఆమెపై నిఘా పెట్టారు. గత 15 రోజుల్లో 4 సార్లు దుబాయ్ వెళ్లొచ్చిన రాన్యా.. ఎలాంటి అనుమానం రాకుండా.. గోల్డ్ బిస్కెట్లను దుస్తుల్లో దాచి, తీసుకొచ్చేవారని డీఆర్ఐ అధికారులు తెలిపారు. ప్రణాళిక ప్రకారం తాజాగా ఆమెను అరెస్ట్ చేశారు. కర్ణాటకకు చెందిన ఓ పోలీసు అధికారికి రాన్యా బంధువని సమాచారం. డీఆర్ఐ అధికారులు ప్రశ్నించగా.. తాను డీజీపీ కుమార్తెనని చెప్పి.. ఇంటి వద్ద డ్రాప్ చేసేందుకుగానూ ఆమె పోలీసులకు కాల్ చేసినట్టు తెలిసింది. అసలు పోలీసు అధికారులతో రాన్యాకు సంబంధమేంటి? ఆ స్మగ్లింగ్‌లో వారి ప్రమేయం ఏమైనా ఉందా? అన్న కోణంలో డీఆర్ఐ అధికారులు ఇన్వెస్టిగేషన్ చేస్తున్నారు. కిచ్చా సుదీప్ హీరోగా నటించిన 'మాణిక్య' చిత్రంతో తెరంగేట్రం చేశారు రాన్యా రావ్. ఆ తర్వాత 'వాఘా', 'పటాకీ' సినిమాల్లో నటించారు.

## ఆదోనికి పోసాని తరలింపు

**గుంటూరు:** సినీ నటుడు పోసాని కృష్ణమురళిని వరుస కేసులు వెంటాడుతున్నాయి. రోజుకు ఒక జైలు అన్నట్టుగా ఆయన జీవితం మారిపోయింది. అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో నరసరావుపేట పీఎస్ లో నమోదైన కేసులో పోసాని గుంటూరు జైల్లో ఉన్నారు. మరోవైపు కర్నూలు జిల్లా ఆదోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో కూడా పోసానిపై కేసు నమోదయింది. దీంతో, ఆదోని త్రీ టౌన్ పోలీసులు గుంటూరు జిల్లా జైల్లో ఉన్న పోసానిని పీటీ వారెంట్‌పై అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం గుంటూరు నుంచి ఆయనను ఆదోనికి తరలించారు.

## ఉద్యోగార్థుల వయోపరిమితి పెంపు

**అమరావతి:** ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వయోపరిమితిని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాన్ యూనిఫామ్ ఉద్యోగాలకు వయోపరిమితి 34 నుంచి 42 ఏళ్లకు, యూనిఫామ్ ఉద్యోగాలకు వయోపరిమితి రెండేళ్లు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది సెప్టెంబరులో జరిగే నియామకాలకు వయోపరిమితి పెంపు వర్తిస్తుందని ప్రభుత్వం తెలిపింది. ఏపీపీఎస్సీతో పాటు పలు ఏజెన్సీలు నిర్వహించే డైరెక్ట్ రిక్రూట్మెంట్ పరీక్షలకు సైతం ఈ వయోపరిమితి పెంపు వర్తించనుంది.

## అన్ని రాష్ట్రాల్లో శ్రీవారి ఆలయాలు

**తిరుమల:** దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి ఉచితంగా స్థలం కేటాయించాలని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు కోరారు. ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలే కాదు.. సమాజ అభివృద్ధికి దోహదపడతాయి. దేశాభివృద్ధిలో టెంపుల్ టూరిజం ప్రత్యేక పాత్ర పోషిస్తోంది. ఆధ్యాత్మికత వైపు అందరూ అడుగులు వేస్తున్నారు. ప్రతి రాష్ట్ర రాజధానిలో వేంకటేశ్వరస్వామి ఆలయం ఉండాలి. కోట్లాది మంది భక్తులు దేవాలయాలకు విరాళాలు ఇస్తున్నారు. వాటిని విద్య, వైద్యం సహా ఇతర సేవా కార్యక్రమాల కోసం ఖర్చు చేస్తున్నాం. మన సంస్కృతి, వారసత్వ పరిరక్షణకు దేవాలయాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని లేఖలో పేర్కొన్నారు.

## ఎస్ఎల్‌బిసి చర్యల్లో కీలక ముందడుగు

**నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లాలోని శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం వద్ద సహాయక చర్యల్లో కీలక ముందడుగు పడింది. ఇటీవల 14వ కిలోమీటరు వద్ద సొరంగం పైకప్పు ఒక్కసారిగా కూలిన ఘటనలో 8 మంది సిబ్బంది అందులో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన 11 రోజులకు టన్నెల్‌లోని కన్వేయర్ బెల్ట్‌ను సాంకేతిక సిబ్బంది పునరుద్ధరించారు. కన్వేయర్ బెల్ట్ పనిచేస్తుండటంతో బురద, మట్టి తొలగింపు పనులు వేగవంతం కానున్నాయి. 200 అడుగులు పేరుకుపోయిన మట్టి, బురద, రాళ్లు, సెగ్మెంట్, టీబీఎం శిథిలాలు ఉండటంతో ఇప్పటి వరకు ఆ 8మంది జాడ గుర్తించలేకపోయారు.

## మహిళల రక్షణ కోసం శక్తియాప్: అనిత

**అమరావతి:** మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టేందుకు, పని ప్రదేశాలలో వారికి రక్షణ కల్పించేందుకు కొత్తగా 'శక్తి' యాప్‌ను తీసుకొస్తున్నామని ఏపీ హోంశాఖ మంత్రి అనిత తెలిపారు. మహిళా దినోత్సవం రోజున ఈ యాప్‌ను సీఎం చంద్రబాబు ప్రారంభించబోతున్నారని వెల్లడించారు. మహిళలపై లైంగిక వేధింపులు, దిశ చట్టంపై శాసనమండలిలో వైకాపా ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు.

# 73,000 పాయింట్ల కిందకు సెన్సెక్స్




## రిలయన్స్‌కు రూ.24,503 కోట్ల నోటీసులు

**ఓఎన్‌జీసీ గ్యాస్ చౌర్యం కేసులో రూ.24,500 కోట్లు**

**బ్యాటరీ సెల్ ప్లాంట్ ఏర్పాటులో జాప్యానికి అనుబంధ సంస్థపై రూ.3.1 కోట్లు**

**దిల్లీ:** రెండు వేర్వేరు కేసుల్లో రూ.24,503.1 కోట్లు చెల్లించాలంటూ ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్)కు ప్రభుత్వం డిమాండ్ నోటీసులు జారీ చేసింది. ఓఎన్‌జీసీ చమురు క్షేత్రం నుంచి, అక్రమంగా గ్యాస్‌ను తరలించిన కేసులో 2.81 బిలియన్ డాలర్ల (సుమారు రూ.24,500 కోట్ల) జరిమానాను పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఆర్ఐఎల్‌కు విధించింది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకం కింద మంజూరు చేసిన బ్యాటరీ సెల్ ప్లాంట్‌ను అనుకున్న సమయంలోపు ఏర్పాటు చేయలేకపోవడంతో రిలయన్స్ అనుబంధ సంస్థ రిలయన్స్ న్యూ ఎనర్జీ బ్యాటరీ స్టోరేజ్ (ఆర్ఎన్ఈబీఎస్ఎల్)కు రూ.3.1 కోట్ల జరిమానా విధించింది. రిలయన్స్ చమురు క్షేత్రం పక్కనే ఉన్న ఓఎన్‌జీసీ క్షేత్రం నుంచి రిలయన్స్, దాని భాగస్వామి సంస్థ బీపీ పీఎల్‌సీలు వెలికితీసి, విక్రయించిన గ్యాస్‌కు ఎటువంటి పరిహారం చెల్లించనక్కర్లేదంటూ అంతర్జాతీయ మధ్యవర్తిత్వ ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పును దిల్లీ హైకోర్టు గత నెల 14న కొట్టేసింది. ఈ నేపథ్యంలోనే రూ.24,500 కోట్లు చెల్లించాలంటూ ప్రభుత్వం డిమాండ్ నోటీసును ఆర్ఐఎల్‌కు పంపింది. బ్యాటరీ సెల్ ప్లాంట్‌ను అనుకున్న సమయంలోపు ఏర్పాటు చేయలేకపోవడంతో ఆర్ఎన్ఈబీఎస్ఎల్‌కు రూ.3.1 కోట్ల జరిమానాను భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ విధించింది. ఈనెల 3 వరకు ఇది రూ.3.1 కోట్లు అవుతుంది. 2025 జనవరి 1 కల్లా ఈ ప్లాంటు సిద్ధం కావాల్సి ఉంది. అప్పటినుంచి ఆలస్యమైన ప్రతి రోజుకు పర్ఫార్మెన్స్ సెక్యూరిటీ (రూ.50 కోట్ల)లో 0.1% (రూ.5 లక్షల) చొప్పున లిక్విడేటెడ్ నష్ట పరిహారాన్ని విధించింది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం కింద 5 గిగావాట్ అవర్ అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ తయారీ కోసం ప్లాంటు పనుల్లో జాప్యం జరిగినందుకు ఈ జరిమానా విధించారు. 2025 మార్చి 3 వరకు లెక్కించిన జరిమానా రూ.3.1 కోట్లుగా ఉంది. గడువు పొడిగించాలని కోరినట్లు ఆర్ఎన్ఈబీఎస్ఎల్ తెలిపింది. జాప్యానికి కారణాలు, కొత్త గడువు తేదీ గురించి వివరాలను సంస్థ వెల్లడించలేదు.

### పదో రోజూ నిఫ్టీకి నష్టాలే

**రూ.1.06 లక్షల కోట్లు పెరిగిన సంపద**

అంతర్జాతీయ వాణిజ్య భయాలు కొనసాగడంతో మంగళవారమూ దేశీయ సూచీలు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 73,000 పాయింట్ల దిగువకు చేరగా, నిఫ్టీ వరుసగా 10వ రోజూ నష్టపోయింది. విదేశీ మదుపర్ల అమ్మకాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 13 పైసలు పెరిగి 87.19 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 1.37% నష్టంతో 70.64 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. సూచీలు నష్టపోయినా బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.1.06 లక్షల కోట్లు పెరిగి రూ.385.07 లక్షల కోట్లు (4.41 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది. సూచీలకు బయట ఉండే కంపెనీల షేర్ల ధరలు కాస్త పెరగడమే ఇందుకు కారణం. సెన్సెక్స్ ఉదయం 269 పాయింట్ల (క్రితం ముగింపు 73,085.94) నష్టంతో 72,817.34 వద్ద ప్రారంభమైంది. ఆరంభ ట్రేడింగ్‌లో 72,633.54 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ, అనంతరం కోలుకుంది. ఒకదశలో 73,033.18 వద్ద గరిష్ఠాన్ని తాకినా, చివరకు 96.01 పాయింట్ల నష్టంతో 72,989.93 వద్ద ముగిసింది. నిఫ్టీ 36.65 పాయింట్లు తగ్గి 22,082.65 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 21,964.60-22,105.05 పాయింట్ల మధ్య కదలాడింది.

కంపెనీపై దివాలా ప్రక్రియను ఎన్‌సీఎల్ఏటీ నిలిపివేయడంతో వరుసగా రెండో రోజూ కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ షేరు దూసుకెళ్లింది. మంగళవారం 20% పెరిగిన షేరు రూ.30.78 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకి, అక్కడే స్థిరపడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 18 డీలాపడ్డాయి. బజాజ్ ఫిన్‌సర్వ్ 2.70%, హెచ్‌సీఎల్ టెక్ 2.40%, నెస్లే 1.71%, ఏషియన్ పెయింట్స్ 1.66%, భారతీ ఎయిర్‌టెల్ 1.13%, సన్‌ఫార్మా 1.13%, ఇన్ఫోసిస్ 1.08%, మారుతీ 1.08% నష్టపోయాయి. ఎస్‌బీఐ 3.02%, జొమాటో 2.45%, టీసీఎస్ 1.03%, అదానీ పోర్ట్స్ 0.63% లాభపడ్డాయి. ఎయిర్‌బస్ వాణిజ్య విమానాలకు టైర్ 1 సరఫరాదారుగా ఎంపికైనట్లు మదర్‌సన్ ప్రకటించింది. అంతర్‌రాష్ట్ర విద్యుత్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసేందుకు సంబంధించిన మూడు ప్రాజెక్టులను దక్కించుకున్నట్లు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ వెల్లడించింది. ఇంధన షేర్ల పరుగులు: కొవిడ్ పరిణామాల్లో చమురుకు గిరాకీ తగ్గడంతో, ధరల్లో స్థిరత్వం తెచ్చేందుకు 2022లో ఉత్పత్తి కోతలను ఒపెక్ దేశాలు ప్రారంభించాయి. ఆ తర్వాత తొలిసారిగా చమురు ఉత్పత్తి పెంచాలని ఒపెక్ దేశాలు నిర్ణయించడంతో, చమురు మార్కెటింగ్ కంపెనీల షేర్లు పరుగులు తీశాయి. చైనా, కెనడా, మెక్సికోపై ట్రంప్ సుంకాలు అమల్లోకి రావడంతో, ముడిచమురు ధరలు తగ్గడమూ ఇందుకు తోడైంది. ఈ నేపథ్యంలో హెచ్‌పీసీఎల్ షేరు 5.88%, బీపీసీఎల్ 3.16%, ఐఓసీ 2.97% లాభపడ్డాయి. అదానీ విల్మర్ చేతికి జీడీ ఫుడ్స్: టాప్స్ బ్రాండ్ కింద ఆహార ఉత్పత్తులను విక్రయించే జీడీ ఫుడ్స్ మ్యానుఫ్యాక్చరింగ్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఎఫ్ఎమ్‌సీజీ సంస్థ అదానీ విల్మర్ ప్రకటించింది. ఇందుకోసం తప్పనిసరిగా అమలయ్యే ఒప్పందం కుదుర్చుకున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. ఈ లావాదేవీ పలు విడతల్లో జరగనుంది. మొదటి దశలో 80% షేర్లను, ఆ తర్వాత మూడేళ్లలో మిగతా 20% షేర్లను అదానీ విల్మర్ కొనుగోలు చేయనుంది. వచ్చే 60 రోజుల్లో మొదటి విడత పూర్తయ్యే అవకాశం ఉంది.





## నష్టాల్లో ముగిసిన మార్కెట్లు..

**ఆటో, ఐటీ నేలచూపు**

దేశీయ బెంచ్‌మార్క్ ఈక్విటీ సూచీలు బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 మంగళవారం నష్టాల్లో ముగిశాయి. 30 షేర్ల సెన్సెక్స్ 96.01 పాయింట్లు లేదా 0.13 శాతం క్షీణించి 72,989.93 వద్ద స్థిరపడింది. ఈరోజు సూచీ 73,033.18-72,633.54 రేంజ్‌లో ట్రేడ్ అయింది. అలాగే నిఫ్టీ 50 36.65 పాయింట్లు (0.17 శాతం) క్షీణించి 22,082.65 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 ఈరోజు గరిష్ఠ స్థాయి 22,105.05 వద్ద, ఇంట్రాడేలో 21,964.60 వద్ద కనిష్ఠాన్ని తాకింది. నిఫ్టీ 50లోని 50 షేర్లలో 28 షేర్లు నష్టాల్లో ముగియగా, బజాజ్ ఆటో, హీరో మోటోకార్ప్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సీఎల్ టెక్, ఐషర్ మోటార్స్ షేర్లు 4.95 శాతం వరకు నష్టపోయాయి. ఎస్బీఐ, బీపీసీఎల్, భారత్ ఎలక్ట్రానిక్స్, శ్రీరామ్ ఫైనాన్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు 3.03 శాతం వరకు లాభపడ్డాయి. విస్తృత మార్కెట్లలో, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 సూచీలు వరుసగా 0.69 శాతం, 0.05 శాతం పెరిగాయి. ఎన్ఎస్ఈలో సెక్టోరల్ ఇండెక్స్‌లు మిశ్రమంగా ముగియగా, పీఎస్‌యూ బ్యాంక్, బ్యాంక్ నిఫ్టీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మీడియా, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, రియల్టీ సూచీలు 2.37 శాతం వరకు లాభపడ్డాయి. మరోవైపు నిఫ్టీ ఆటో, ఐటీ, ఫార్మా, ఎఫ్ఎంసీజీ రంగాల సూచీలు 1.31 శాతం వరకు నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ ఇండెక్స్ స్వల్పంగా 0.08 శాతం నష్టపోయింది.

## చేతులు మారనున్న నాగార్జున ఫెర్టిలైజర్




**హైదరాబాద్:** నాగార్జున ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్‌సీఎల్) యాజమాన్యం మారిపోనుంది. దాదాపు మూడున్నర దశాబ్దాలుగా యూరియా తయారీలో నిమగ్నమైన ఈ సంస్థలో, తమ వాటా విక్రయించి వైదొలగాలని ప్రమోటర్లు నిర్ణయించుకున్నారు. కేవీస్ రాజు కుటుంబ సంస్థలు ఎన్ఎఫ్‌సీఎల్‌కు ప్రమోటర్లుగా ఉన్నారు. ఎరువుల వ్యాపారంపై ప్రభుత్వ నియంత్రణ అధికంగా ఉన్న నేపథ్యంలో.. ఈ విభాగం నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నట్లు, అందువల్ల ఎన్ఎఫ్‌సీఎల్‌లో తమ వాటా విక్రయించాలనే ఆలోచనకు వచ్చినట్లు ప్రమోటర్ల గ్రూపునకు చెందిన అమ్లికా మర్కెంటైల్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఎంపీఎల్) వెల్లడించింది. ఇదే విషయాన్ని ఈ సంస్థ ఎన్ఎఫ్‌సీఎల్‌కు తెలియజేసింది. ఎన్ఎఫ్‌సీఎల్‌లో ఈ సంస్థకు 29,60,72,140 షేర్లు (49.51% వాటా) ఉన్నాయి. ఈ వాటాను సహ ప్రమోటర్ అయిన క్రిభ్కో (క్రిషక్ భారతీ కోఆపరేటివ్ లిమిటెడ్)కు విక్రయించడానికి సిద్ధపడి, ఆ మేరకు 'ఆఫర్' ఇచ్చింది. విదేశీ ప్రమోటర్ అయిన సాయ్‌పెమ్ ఎస్‌పీఏ(కు విక్రయించడానికీ ముందుకు వచ్చింది. అయితే క్రిభ్కో - సాయ్‌పెమ్ ఎస్‌పీఏ సంస్థలు ఏఎంపీఎల్ నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ షేర్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపలేదు. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించనున్నట్లు ఏఎంపీఎల్ వెల్లడించింది. కొన్ని షేర్లు కానీ, మొత్తం కానీ విక్రయిస్తామని స్పష్టం చేసింది. ఇదే జరిగితే ఎన్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం నుంచి కేవీస్ రాజు కుటుంబం వైదొలిగినట్లు అవుతుంది. అమ్లికా మర్కెంటైల్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఎంపీఎల్) తో పాటు క్రిభ్కో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, సాయ్‌పెమ్ ఎస్‌పీఏ, ఫైర్‌సీడ్ లిమిటెడ్ సంస్థలు ఎన్ఎఫ్‌సీఎల్ ప్రమోటర్లుగా ఉన్నాయి. ఈ సంస్థలకు కలిపి 56.0% వాటాలున్నాయి. ఇందులో ఏఎంపీఎల్ చేతిలోనే అత్యధికంగా 49.51% వాటా ఉంది. ఏఎంపీఎల్‌లో మణికందన్ కాశీవిశ్వనాథన్, కె.రాహుల్ రాజు డైరెక్టర్లుగా ఉన్నారు. ఎన్ఎఫ్‌సీఎల్ వ్యాపార కార్యకలాపాలు కొన్నేళ్లుగా సజావుగా సాగడం లేదు. యూరియా వ్యాపారాన్ని, మైక్రో-ఇరిగేషన్ వ్యాపార విభాగాన్ని ఏడాదిన్నర క్రితం గ్రీన్‌కో గ్రూపునకు చెందిన ఏఎం గ్రీన్ అమ్మోనియాకు రూ.1700 కోట్లకు విక్రయించింది. తర్వాత ఈ సంస్థ నుంచి యూరియా కొనుగోలు చేసి, నాగార్జునా యూరియా బ్రాండుతో విక్రయించడం వరకే ఎన్ఎఫ్‌సీఎల్ పరిమితమైంది. ఎన్ఎఫ్‌సీఎల్ సహ ప్రమోటర్ అయిన క్రిభ్కో ఎంతో కాలంగా తన షేర్లను స్టాక్‌మార్కెట్ ద్వారా విక్రయిస్తూ వస్తోంది. క్రిభ్కో కూడా తన వాటా కొనుగోలు చేయాలని ఇతర ప్రమోటర్లకు 'ఆఫర్' ఇచ్చినా, ఎవరూ ఆసక్తి చూపలేదు. దీంతో షేర్లు విక్రయించడం మొదలు పెట్టి, తన వాటా తగ్గించుకుంటూ వచ్చింది. ఇప్పుడు ఇదే పద్ధతిలో అమ్లికా మర్కెంటైల్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఎంపీఎల్) కూడా తన వాటా విక్రయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. తత్ఫలితంగా ఎన్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం మారి, కొత్త ప్రమోటర్ల చేతికి సంస్థ వెళ్లనుంది. తాజాగా ఎన్ఎఫ్‌సీఎల్ సీనియర్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (సేల్స్, మార్కెటింగ్) ఎ.నరసారెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. తన వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు ఆయన కంపెనీకి తెలియజేశారు.

## ఐటీ అధికారులకు 'కొత్త' పవర్స్..

ఇంటర్నెట్ డెస్క్: ఆదాయపు పన్ను విభాగం అధికారులకు కొత్త అధికారాలు దఖలుపడనున్నాయి. ఇకపై వ్యక్తుల సోషల్‌మీడియా ఖాతాలు, ఇ-మెయిల్స్, ఆన్‌లైన్‌లో చేసిన పెట్టుబడులు, ట్రేడింగ్ అకౌంట్ల వివరాలను సైతం వారు కోరొచ్చు. పన్ను ఎగవేతకు పాల్పడడం లేదా ఆదాయానికి మించి ఆస్తులు, నగదు, బంగారం కలిగి ఉన్నట్లు గుర్తిస్తే మీ ఖాతాలన్నింటినీ వారు తనిఖీ చేయొచ్చు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న ఆదాయపు పన్ను బిల్లులో దీనికి సంబంధించిన నిబంధనలను పొందుపరిచారు. ఆయా నిబంధనలు ఐటీ అధికారులకు కొత్త అధికారాలను కట్టబెట్టనున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న ఆదాయపు పన్ను చట్టం, 1961 ప్రకారం ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారులకు కొన్ని పరిమిత అధికారాలు మాత్రమే ఉన్నాయి. ఎవరైనా ఆదాయపు పన్ను ఎగవేతకు పాల్పడినట్లు విశ్వసనీయ సమాచారం ఉంటే సోదాలు, తనిఖీలు నిర్వహిస్తారు. లావాదేవీలకు సంబంధించిన ఏవైనా డాక్యుమెంట్లు, ఆర్థిక వివరాలకు సంబంధించిన పత్రాలను దాచిపెట్టినట్లు అనుమానం వస్తే డోర్లు, లాకర్లు పగలగొట్టే అధికారం ఐటీ అధికారులకు ఉంది. అయితే, కొత్త ఆదాయపు పన్నుకు సంబంధించిన బిల్లులో మరిన్ని కొత్త అధికారాలు చేర్చారు. ఇకపై వ్యక్తుల వర్చువల్ డిజిటల్ సిస్టమ్ లేదా కంప్యూటర్ సిస్టమ్‌లోకి చొచ్చుకెళ్లే అధికారం కూడా కల్పిస్తోంది. డిజిటల్ యుగానికి తగ్గట్టు ఈ నిబంధనలు రూపొందించడం గమనార్హం. దీని ప్రకారం.. ఆదాయపు పన్ను ఎగవేతకు సంబంధించి సమాచారం ఉంటే అధికారులు సంబంధిత వ్యక్తి ఇ-మెయిల్స్, బ్యాంక్ ఖాతాలు, ట్రేడింగ్ ఖాతాలు, సోషల్‌మీడియా యాక్టివిటీపై ఆరా తీయొచ్చు. పార్లమెంట్ ఆమోదం పొందితే 2026 ఏప్రిల్ 1 నుంచి కొత్త చట్టం అమల్లోకి రానుంది. అయితే, ఆదాయపు పన్ను బిల్లులోని మార్పులు ట్యాక్స్ ఎగవేతను అడ్డుకోగలుగుతాయా? లేదంటే ప్రైవసీపై ఆందోళనలు లేవనెత్తుతాయా? అన్నది చూడాలి.

## రూ.22,999 నుంచీ నథింగ్ 3ఏ ఫోన్లు



**దిల్లీ:** బ్రిటన్ సంస్థ నథింగ్, తమ 3ఏ స్మార్ట్‌ఫోన్లను మనదేశంలో విడుదల చేసింది. నథింగ్ 3ఏ, నథింగ్ 3ఏ ప్రో మోడళ్లను స్నాప్‌డ్రాగన్ 7ఎస్ జెన్ 3 చిప్‌సెట్లతో ఆవిష్కరించినట్లు సంస్థ ప్రకటించింది. ప్రో మోడల్‌లో కెమేరా మాడ్యూల్ పెద్దదిగా ఉంటుంది. బ్యాంక్ ఆఫర్లు కలిపి 3ఏ ఫోన్ 8జీబీం128 జీబీ ధర రూ.22,999, 8జీబీం256జీబీ ధర రూ.24,999 అని సంస్థ తెలిపింది. 3ఏ ప్రో ఫోన్ 8జీబీం128జీబీ ధర రూ.27,999. 8జీబీం256జీబీ ధర రూ.29,999, 12జీబీం256జీబీ ధర రూ.31,999 అని సంస్థ ప్రకటించింది. ఈనెల 11 నుంచి ఈ ఫోన్లు దిగ్గజ రిటెయిల్ షోరూంలతో పాటు ఫ్లిప్‌కార్ట్‌లోనూ లభిస్తాయని సంస్థ తెలిపింది. 6.77 అంగుళాల అమోల్డ్ డిస్‌ప్లే, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, 50 వాట్ ఫాస్ట్‌ఛార్జర్ కలిగిన ఈ ఫోన్‌ను 56 నిమిషాల్లో పూర్తిగా ఛార్జింగ్ చేయొచ్చని సంస్థ వివరించింది.

# విశ్వసనీయ భాగస్వామి భారత్

**ప్రపంచమంతా మనల్ని అలానే చూస్తోంది**


**పరిశ్రమ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి**

**ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు**



**దిల్లీ:** 'ప్రపంచమంతా భారత్‌ను ఒక విశ్వసనీయ భాగస్వామిగా చూస్తోంది. అందువల్ల అంతర్జాతీయ అవకాశాలను అందిపుచ్చుకుని, ప్రయోజనాలు పొందేంద%రి%్నకు భారత పారిశ్రామిక రంగం భారీ అడుగులు వేయాల'ని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. తయారీ, ఎగుమతులకు ప్రోత్సాహమివ్వడానికి భారత్ రెండు మిషన్లను ఆవిష్కరించనుందని తెలిపారు. నియంత్రణ, పెట్టుబడులు, సులభతర వాణిజ్య సంస్కరణలపై జరిగిన బడ్జెట్ అనంతర వెబినార్‌లో ఆయన మాట్లాడారు. ముఖ్యాంశాలివీ.. సంక్లిష్ట సమయాల్లోనూ బలంగా...: ఇది ఒక గొప్ప అవకాశం. దేశానికి, మీకు (పరిశ్రమ) వీటిని అందిపుచ్చుకునే సామర్థ్యం ఉంది. మనం వీక్షకులుగా ఉండరాదు. మీ అవకాశాలను మీరే అందుకోవాలి. అంతర్జాతీయ గిరాకీని అందిపుచ్చుకోవడానికి దేశంలో తయారు చేయదగ్గ కొత్త ఉత్పత్తులను గుర్తించాలి. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు భారత్ ఒక వృద్ధి చోదకంగా ఉంది. మహిళలకు రూ.2 కోట్ల వరకు రుణమిస్తాం: దేశంలో 6 కోట్లకు పైగా సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి కంపెనీ (ఎస్ఎమ్ఎస్ఈ)లకు సరైన సమయంలో, తక్కువ వడ్డీకి నిధులు అందేలా కొత్త రుణ పద్ధతులను అభివృద్ధి చేయాలి. తొలిసారిగా వ్యాపారంలోకి అడుగుపెట్టబోయే 5 లక్షల మంది మహిళలు, ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రూ.2 కోట్ల వరకు రుణాలు అందిస్తాం. ఎమ్ఎస్ఎమ్ఈలకు కేవలం రుణాలే కాకుండా 'మెంటార్‌షిప్ ప్రోగ్రామ్స్' సిద్ధం చేయాలి. పదేళ్ల కిందట ఎమ్ఎస్ఎమ్ఈలు రూ.12 లక్షల కోట్ల రుణాలు పొందాయి. ఇపుడు రూ.30 లక్షల కోట్లకు ఇవి చేరాయి. బడ్జెట్‌లో ఈ రుణాలకు గ్యారెంటీ కవరేజీని రూ.20 కోట్లకు పెంచాం. ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే ఒక స్థిర విధానం, మెరుగైన వ్యాపార వాతావరణం కీలకం. కేంద్రం, రాష్ట్ర స్థాయుల్లో 40,000 నిబంధనలను ప్రభుత్వం తొలగించింది. ప్రస్తుతం 'జన్ విశ్వాస్ 2.0' బిల్లుపై ప్రభుత్వం పనిచేస్తోంది. ఆర్థికేతర రంగ నియంత్రణలను సమీక్షించడానికి ఒక కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.

రూ.13 లక్షల కోట్లకు పైగా ఉత్పత్తి..: పీఎల్ఐ (ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహక) పథకాల నుంచి 14 రంగాలు ప్రయోజనం పొందుతున్నాయి. 750కు పైగా యూనిట్లు ఈ పథకం కింద అనుమతి పొందాయి. ఈ పథకాల కింద రూ.1.5 లక్షల కోట్ల పెట్టుబడులు లభించాయి. రూ.13 లక్షల కోట్లకు పైగా ఉత్పత్తి, రూ. 5 లక్షల కోట్ల ఎగుమతులు జరిగాయి. నిబంధనల భారాన్ని తగ్గిస్తున్నాం..సీతారామన్: నియంత్రణల భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. 'సరళతర, ఎగుమతులకు స్నేహపూర్వకంగా ఉండే ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను తయారు చేసేందుకు అవసరమైన చర్యలను కేంద్రం తీసుకుంటోంద'ని అన్నారు.





# బిగ్‌బాస్9 సీజన్‌కు హెూస్ట్‌గా విజయ్‌దేవరకొండ

బుల్లితెర రియాలిటీ షో బిగ్ బాస్ తెలుగుకి ప్రేక్షకులలో మంచి ఫాలోయింగ్ ఉన్న విషయం తెలిసిందే. ఇప్పటివరకు 8 సీజన్‌లు విజయవంతంగా కంప్లీట్ చేసుకున్న ఈ షో 9వ సీజన్‌కి సిద్ధమవుతుంది. ఇక 9వ సీజన్ మరింత రసవత్తరంగా ఉండబోతున్నట్లు తెలుస్తుంది. ఇదిలావుంటే కొత్త సీజన్‌కి కొత్త హెూస్ట్ రాబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే వచ్చిన 8 సీజనలలో మొదటి సీజన్‌కి అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ హెూస్ట్ చేయగా ఆ తర్వాత వచ్చిన సెకండ్ సీజన్‌కి నాని వ్యాఖ్యతగా వ్యవహారించాడు. ఇక మూడవ సీజన్ నుంచి ఇప్పటివరకు సక్సెస్‌ఫుల్ హెూస్ట్‌గా రాణిస్తున్నాడు కింగ్ నాగార్జున. అయితే తాజాగా వచ్చే కొత్త సీజన్‌కి టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ హెూస్ట్‌గా చేయబోతున్నట్లు తెలుస్తుంది. దీపికి సంబంధించిన వార్తలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇక ఈ వార్త విన్న విజయ్ అభిమానులు సోషల్ మీడియాలో ట్రెండ్ చేయడం మొదలుపెట్టారు. కాగా ఇందుకు సంబంధించి బిగ్ బాస్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. విజయ్ సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరితో కింగ్‌డమ్ అనే సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమాను సితార ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై సూర్య దేవర నాగవంశీ నిర్మిస్తుండగా.. అనిరుధ్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రం మే 30న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# సిరాజ్‌తో డేటింగ్‌పై నోరువిప్పిన బిగ్‌బాస్ బ్యూటీ

ఇండియన్ స్టార్ క్రికెటర్‌లు, బాలీవుడ్ హీరోయిన్‌ల మధ్య డేటింగ్ వార్తలు రావడం సహజమే అన్న విషయం తెలిసిందే. ఇప్పటికే పలువురు క్రీడ ప్రముఖులు సినీ నటుల మధ్య వార్తలు రాగా.. అందులో కొన్ని నిజం కూడా అయ్యాయి. అయితే తాజాగా స్టార్ క్రికెటర్ మొహమ్మద్ సిరాజ్‌తో బిగ్‌బాస్ 13 ఫేమ్ నటి మహిరా శర్మ డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వైరల్ అయ్యాయి. దీనికి ముఖ్య కారణం సిరాజ్, మహిరాలు ఇన్‌స్టాగ్రామ్ ఒకరినొకరు ఫాలో అవ్వడమే. అయితే ఈ ఫాలోయింగ్ లైక్‌ల వరకు వెళ్లడంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారా అని గాసిప్స్ స్టార్ట్ అయ్యాయి. అయితే ఈ పుకార్లపై తాజాగా స్పందించింది మహిరా శర్మ. బాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. నేను ఎవరినీ డేట్ చేయడం లేదు. సిరాజ్‌తో డేటింగ్ అంటూ వస్తున్న వార్తలు నిజం కాదు. పబ్లిక్ ఫిగర్‌గా ఇలాంటి పుకార్లను ఎదుర్కోవడం సర్వసాధారణం. అభిమానులు తమకు నచ్చిన విధంగా ఎవరితోనైనా లింక్‌లు పెడుతారు. ఇంతకుముందు బిగ్ బాస్‌లో ఉన్నప్పుడు కూడా ఇలాంటివి జరిగాయంటూ మహిరా చెప్పుకోచ్చింది.

# మాధురిని రక్తంవచ్చేలా ముద్దుపెట్టిన హీరో



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ మాధురి దీక్షిత్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తన నటనతో 1980-90ల్లో బాలీవుడ్‌ని ఓ ఊపు ఊపేసింది. దాదాపు 70కి పైగా చిత్రాల్లో నటించిన ఈ ముద్దుగుమ్మ తన డ్యాన్స్‌తో పాటు న టనతో ప్రేక్షకుల్ని కట్టిపడేసింది. అయితే 'బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్'గా పేరు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ కెరీర్‌లో కూడా ఒక మరిచిపోలేని చేదు సంఘటన ఉంది. తన కెరీర్‌లో బిగినింగ్ టైంలో వినోద్ ఖన్నాతో చేసిన ఒక మూవీలో ఈ ఘటన జరిగింది. 1984లో "అబోధ్" సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టింది మాధురి దీక్షిత్. తొలి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ నటి. అయితే 1988లో బాలీవుడ్ సీనియర్ నటుడు వినోద్ ఖన్నా ప్రధాన పాత్రలో వచ్చిన చిత్రం దయావన్. 1987లో కమల్ హాసన్ నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం నాయకన్ సినిమాకి ఇది రీమేక్‌గా తెరకెక్కింది. ఈ చిత్రంలో మాధూరి కథానాయికగా నటించగా.. ఫిరోజ్ ఖాన్ దర్శకత్వం వహించాడు. అయితే ఈ సినిమా షూటింగ్‌లో భాగంగా వినోద్ ఖాన్నా మాధూరి పెదవులు కొరకడం అప్పట్లో పెద్ద వివాదానికి దారి తీసింది. చిత్ర షూటింగ్‌లో భాగంగా.. ఆజ్ ఫిర్ తుమ్ పే ప్యార్ ఆయా హైపాట చిత్రీకరిస్తుండగా.. వినోద్ మాధురిని ముద్దు పెట్టుకోవాల్సి వచ్చింది.



# 15 ఏళ్లలో ప్రేమ, పెళ్లి, విడాకులు

టాలీవుడ్ అందాల ముద్దుగుమ్మ సమంత గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. స్టార్ హీరోయిన్‌గా ఓ రేంజ్‌లో పాపులారిటీ సంపాదించుకున్న ఈ భామ ఆ తర్వాత నాగ చైతన్యని ప్రేమించి పెళ్లి చేసుకుంది. సంసారం సజావుగా సాగుతున్న సమయంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి అతని నుండి విడిపోయింది. ఇక ప్రస్తుతం సింగిల్‌గా ఉంటుంది. ఇక చైతూ నుండి విడిపోయిన తర్వాత సమంతకి మయోసైటిస్ అనే వ్యాధి బయటపడింది. చాలా రోజుల పాటు ఈ వ్యాధితో బాధపడ్డ సమంత సినిమాలకి కూడా బ్రేక్ ఇచ్చింది. అయితే చివరికి ఆ వ్యాధితో ధీటుగా ఎదుర్కొని మళ్లీ సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతుంది. అయితే సమంత సినిమాల్లోకి వచ్చి 15 ఏళ్లు పూర్తయ్యాయి. 2010లో విడుదలైన ఏ మాయ చేసావే సినిమా ద్వారా సమంత ఆరంగేట్రం చేసింది. ఈ మూవీ ఫిబ్రవరి 26,2010న విడుదలై పెద్ద విజయం సాధించింది. ఈ సినిమాలో సమంతతో చైతూ జంటగా నటించాడు. ఈ మూవీ సమయంలోనే వారిద్దరి మధ్య ప్రేమ పుట్టిందని టాక్. అయితే ఏ మాయ చేశావే సినిమా విడుదలై 15 ఏళ్లు కావడంతో, సమంత సినీ జర్నీ కూడా 15 ఏళ్లు పూర్తి అయింది. ఈ సినీ ప్రయాణంలో సమంత.. అల్లు అర్జున్, ఎన్టీఆర్, పవన్ , మహేష్, రామ్ చరణ్ లాంటి స్టార్ హీరోల సరసన నటించి అలరించిఆంది. తమిళంలో కూడా వరుస సినిమాలు చేసింది. చివరిగా సమంత తెలుగులో ఖుషి, తమిళంలో కాతువాక్కుల రెండు కాదల్ సినిమాల్లో నటించింది.